స్కూల్ బస్సు బోల్తా


పెదకామనపూడి వద్ద పొలాల్లో బోల్తా పడిన ప్రైవేట్ స్కూల్ బస్సు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంద్రిక, సుమంత్

- ఇద్దరికి తీవ్రంగా, పలువురికి స్వల్పంగా గాయాలు
- పెదకామనపూడి సమీపంలో ప్రమాదం.. విద్యార్థుల హాహాకారాలు
- రక్షించిన స్థానికులు.. ఆసుపత్రులకు తరలింపు
- స్టీరింగ్ రాడ్ విరిగిపోవడమే కారణం

ముదినేపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో స్కూల్ బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్రంగాను, పలువురికి స్వల్పంగాను గాయాలయ్యాయి. ముదినేపల్లికి చెందిన ఇండో సాక్సన్ స్కూలు బస్సు విద్యార్థులను ఎక్కించుకుని బుధవారం ఉదయం చిగురుకోట నుంచి ముదినేపల్లి బయలుదేరింది. పెదకామనపూడి సమీపంలో స్టీరింగ్ మెయిన్ రాడ్ విరిగి బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. బస్సులోని విద్యార్థులు హాహాకారాలు చేశారు. అరుపులు, కేకలు, ఏడుపులతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఇది విని అటుగా వెళుతున్న వడాలికి చెందిన వీరంకి నాంచారయ్య, రాజా శివపార్వతి, మోర్త సింహాచలంతోపాటు స్థానికులు బస్సు అద్దాలు పగులకొట్టి విద్యార్థులను, డ్రైవర్ ప్రభాకరరావును సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. వీరిలో చిగురుకోట చెందిన చంద్రిక(8), ఆమె సోదరుడు సుమంత్(7)కు తీవ్రగాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్పంగాను దెబ్బలు తగిలాయి. వీరిని ముదినేపల్లి, గుడివాడ ప్రభుత్వ, స్థానిక ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. విషయం తెలిసిన వెంటనే కైకలూరు సీఐ రవికుమార్, ఎస్‌ఐ వీరభద్రరావు, పోలీసు సిబ్బంది, తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. చంద్రిక తండ్రి తమ్మా నరసింహారావు ఫిర్యాదు మేరకు ముదినేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 31 మంది విద్యార్థులు ఉన్నారు. ఘటనపై ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థులను కాపాడిన స్థానికులను అభినందిం చారు. టీడీపీ నియోజక వర్గ సమ న్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహా రావు తదితరులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

స్కూలు బస్సులపై 15 కేసులు నమోదు

ఏలూరు క్రైం/ముదినేపల్లి/కలిదిండి, ఆగస్టు 6(ఆంధ్ర జ్యోతి): పెదకామనపూడిలో ప్రైవేటు స్కూలు బస్సు బోల్తా ఘటనపై పోలీసు, రోడ్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ అధికారులు అప్రమత్తమయ్యారు. రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ షేక్ కరీమ్ పర్యవేక్షణలో అధికారులు జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు విద్యా సంస్థల బస్సులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 15 కేసులు నమోదు చేసి రూ.26 వేలు అపరాధ రుసుము విధించారు. విద్యార్థులను తరలించే విషయంలో నిబంధనలు పాటించని విద్యా సంస్థల బస్సులను, ప్రైవేటు వాహనాలను సీజ్ చేస్తామని డీటీసీ కరీమ్ హెచ్చరించారు. ముదినేపల్లి, కలిదిండిలోని అన్ని ప్రైవేటు పాఠశాలల బస్సులను తనిఖీచేశారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశాలతో కైకలూరు రూరల్ సీఐ వి.రవి కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు, ఎస్‌ఐలు వీరభద్రరావు, వి.వెంకటేశ్వరరావు, కలిదిండి బ్రేక్ ఇన్‌స్పెక్టర్ స్వామి, బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సులను, ఇతర పత్రాలను పరిశీలించారు.


ఇండోసాక్సన్ స్కూలు బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కలెక్టర్

ఏలూరు/అర్బన్ ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహించే వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెట్రి సెల్వి హెచ్చరించారు. బుధవారం అధికారులతో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్సులో ఆమె మాట్లాడారు. జిల్లాలోని బొర్రంపాలెం, కొల్లేటికోట, జీలుగుమిల్లి పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఐవీఆర్ఎస్ సర్వేలో తేలిందన్నారు.

- గిరిజన ప్రాంతాల్లో సమర్థవంతమైన పాలన అందించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఆదికర్మ యోగి అభియాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు.
- ఏలూరు నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు పటిష్ఠ ప్రణాళిక అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌పై ఆమె సమీక్షించారు.
- ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా జరపాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆర్బీఎస్కే విభాగం ముద్రించిన వాల్‌పోస్టర్లను కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.
- కలెక్టరేట్‌లో భూముల రీ సర్వే, పీజీఆర్ఎస్, ఇతర అంశాలపై జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావుతో కలిసి కలెక్టర్ బుధవారం సమీక్షించారు.
- ఇళ్ల నిర్మాణంలో జిల్లాను మూడోస్థానం నుంచి రెండో స్థానం తీసుకువచ్చేందుకు అధికారులు మరింత కష్టపడి పనిచేయాలని బుధవారం హౌసింగ్ అధికారుల సమీక్షలో కలెక్టర్ సూచించారు.

నిధులివ్వండి.. మహాప్రభో!



ఊరు బాగుపడాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయాలి. గ్రామ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఏ ప్రతిపాదన వచ్చినా వాటిని సాకారం చేసేందుకు నిధులే ముఖ్యం. అది నుంచి ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం తలసరి గ్రాంట్‌ను ఎప్పటికప్పుడు ఇస్తూనే ఉంది. 14వ ఆర్థిక సంఘం నిధులను ఏకంగా పంచాయతీలకు ఇవ్వకుండానే అప్పట్లో కరెంటు బిల్లులకు ముడిపెట్టారు. ఇప్పుడు 15వ ఆర్థిక సంఘం నిధుల విషయంలోను మళ్లీ సర్పంచ్‌లే వీధులకెక్కాల్సిన పరిస్థితి నెలకొంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వీధులకెక్కుతున్న పంచాయతీ ప్రతినిధులు

- ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ ఇలాంటి వేడుకోలే..
- జగన్ హయాంలో దారిమళ్లిన 14వ ఆర్థిక సంఘం నిధులు
- 15వ సంఘంలోను తొలి విడత ఓకే
- మలి విడతలోనే ప్రభుత్వం తకరారు

ప్రతీ ఆర్థిక సంవత్సరంలోను సర్పంచ్ దగ్గర నుంచి మిగతా ప్రతినిధులు మా ఊరికి రావాల్సిన నిధులు ఎక్కడా అంటూ వీధులకెక్కి దర్నాలు చేయాల్సిందే. అధికార పార్టీలో భాగమైనా ఖాతరు చేయకుండా ఎదురు ప్రశ్నించాల్సిందే. ఆర్థిక సంఘం నిధులు విడుదలైన ప్రతీసారి ఇదే తంతు. ఆర్థిక సంఘం నిధులను తలసరి పేరిట గ్రామాభివృద్ధికి కేటాయిస్తారు. ఏటా రెండు విడతలుగా ఈ నిధులను పంచాయతీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. 2014-19 వరకు వివిధ ఆర్థిక సంఘాల ద్వారా వచ్చిన నిధులు పంచాయతీలకే వచ్చి చేరాయి. కాని జగన్ ప్రభుత్వంలో ఇదంతా తారుమారైంది.

జగన్ సర్కార్ కొత్త భాష్యం

జగన్ జమానా ఐదేళ్లల్లోను సర్పంచ్‌లుగా ఎన్నికైన పాపానికి గ్రామాభివృద్ధికి రూపాయి ఖర్చు పెట్టలేకపోయారు. ఏకంగా 14వ ఆర్థిక సంఘం నిధులను అప్పటి జగన్ సర్కార్ దారి మళ్లించింది. ఇదెక్కడి అన్యాయమంటూ ప్రశ్నించిన సర్పంచ్‌పై కేసులు కట్టి కోర్టుల చుట్టూ తిప్పారు. వాస్తవానికి ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన నిధులు పంచాయతీల్లో కాస్తోకూస్తో అభివృద్ధికి చేదోడువాదోడుగా ఉండేవి. కాని ఆర్థిక సంఘం ద్వారా వచ్చే నిధులను వేరే వ్యవహారాలకు మళ్లించుకోవచ్చునంటూ జగన్ సర్కార్ కొత్త భాష్యం చెప్పింది. దీనికి అనుగుణంగానే అప్పట్లో వచ్చిన నిధులను పంచాయతీల్లో కరెంటు బిల్లులు బకాయిలకు చెల్లిస్తున్నట్టు అర్థరాత్రి ప్రకటించి తెల్లవారేసరికల్లా కోట్ల రూపాయలు మళ్లించారు. ఈ విషయం తెలిసి సర్పంచ్‌లు లబోదిబోమన్నా పట్టించుకున్నవారేరి.

15వ ఆర్థిక సంఘం నిధులివ్వండి..

2024-25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం ద్వారా ఏలూరు జిల్లాకు దాదాపు రూ.70 కోట్లు కేటాయించారు. కేంద్రం నుంచి ఈ నిధులు విడుదలవుతాయి. వీటిని రెండు విడతలుగా ఆయా పంచాయతీల ఖాతాలో జమ చేస్తారు. ఇప్పటికే ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి తొలి విడత నిధులను పంచాయతీలకు అప్పగించారు. మలివిడతకు వచ్చేసరికి జాప్యమవుతోంది. ఇప్పుడు ఆ నిధుల కోసమే సర్పంచ్‌లు ఆందోళన బాట పట్టారు. ఎట్టి పరిస్థితుల్లో పంచాయతీలకు రావాల్సిన నిధులు ఇచ్చి తీరాల్సిందేనని పట్టుపడుతున్నారు. ఇప్పటికే నాలుగేళ్లు తమ పదవీకాలం గడిచి పోయిందని ఇప్పుడు కూడా ఇవ్వాల్సింది ఇవ్వకుండా ఎందుకిలా వ్యవహరిస్తున్నారంటూ అధికారులపై విరుచుకుపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 531 గ్రామాల్లో ఈ నిధుల కోసమే పంచాయతీ పాలకమండళ్లు ఎదురుచూస్తున్నాయి.

కరెంటు బిల్లులతో ఓ తంటా

స్థానిక సంస్థల్లో విద్యుత్ వినియోగం అప్పటికీ ఇప్పటికీ ఎంత అనేది ఎక్కడా కనిపించని దాఖలాలే. తాగునీటి (మిగతా 8వ పేజీలో)

ఆక్రమణల చెరలో..



కాంతంపాలెం రోడ్డులో ఉన్న దారిలేని హిందూ శ్మశాన వాటిక

- చింతలపూడిలో పేరుకే మిగిలిన హిందూ శ్మశాన వాటికలు..
- పట్టించుకోని అధికారులు
- స్వచ్ఛంద సంస్థలకు అందని సహకారం

చింతలపూడి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):చింతలపూడి నగర పంచాయతీగా మారినా హిందూ శ్మశాన వాటికల సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఉన్న శ్మశాన వాటిక స్థలాలు ఆక్రమణల చెరలో ఉన్నాయి. వీటిని అధికారులు పట్టించుకోవడంలేదు. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి తాము సహకరిస్తామని చెప్పినా చేయూతనివ్వడంలేదు. ఫలితంగా మృతదేహాలను మరుభూమికి తరలిస్తున్న వారి బాధలు వర్ణనాతీతం. నగర పంచాయతీలో హిందూవులకు మూడుచోట్ల శ్మశాన స్థలాలు ఉన్నాయి. ఇవి చాలా వరకు ఆక్రమణల చెరలో ఉన్నాయి. సాయిరాం గుడి సమీపంలో ఉన్న శ్మశాన స్థలం ఎకరం 60 సెంట్లు గతంలో ఉండగా పట్టణం పెరిగిన కొద్ది ఆక్రమణకు గురికావడంతో కేవలం కొద్ది స్థలం మాత్రమే మిగిలింది. అక్కడ కనీసం నీటి సౌకర్యం లేదు. ఫైర్‌స్టేషన్ వెనుకవైపు భాగంలో ఉన్న శ్మశాన భూమి స్థలం పూర్తిగా ఆక్రమించబడింది. కనీసం మృతదేహాలకు దహనక్రియలు కూడా చేయడం లేదు. కాంతంపాలెం రోడ్డులోని శ్మశాన వాటికలో మానవత స్వచ్ఛంద సంస్థ రూ.ఆరు లక్షల వ్యయంతో కొన్ని సౌకర్యాలు కల్పించింది. దీనికి చెరువు ఆధారంగా ఉండడంతో నీటి సమస్యకు చెరువులో నీరు ఉన్నంత వరకు ఇబ్బందిలేదు. అయితే వర్షాకాలం వస్తే ఈ శ్మశాన వాటికకు వెళ్లాలంటే దారిలేక ఇబ్బంది పడుతున్నారు. శ్మశానవాటికలు ఆక్రమణలకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. శ్మశాన వాటికల అభివృద్ధికి ఉపాధి నిధులు వినియోగించుకునే అవకాశం ఉన్నా అధికారులు దీనిపై దృష్టి పెట్టకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హిందూ స్మశాన స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలని, సౌకర్యాలు కల్పించాలని ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో స్వచ్ఛంద సంస్థలు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు.

ఆక్రమణలు తొలగిస్తే అభివృద్ధి చేస్తాం



పట్టణంలోని హిందూ శ్మశాన స్థలాల్లో ఆక్రమణలు అధికారులు తొలగించి అప్పగిస్తే దాతల సహకారంతో అభివృద్ధి చేస్తాం. అందుకు అధికారులు చేయూతనివ్వాలి. కాని పలుమార్లు మేము విజ్ఞప్తులు చేసినా ఎందుకనో అధికారులు మౌనం వహిస్తున్నారు. ప్రజల సమస్య పరిష్కారం కోసం ముందుకు రావాలి.

- ఆర్నేపల్లి అప్పారావు, మానవత గౌరవ అధ్యక్షుడు, చింతలపూడి

రేపు ఏలూరులో సీపీఐ జిల్లా సదస్సు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా సమగ్ర అభివృద్ధిపై సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ఏలూరులో సదస్సు నిర్వహించనున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య తెలిపారు.స్థానిక స్ఫూర్తి భవన్‌లో బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఐ శత వార్షికోత్సవాల్లో భాగంగా సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు ఈనెల 23 నుంచి 25 వరకు ఒంగోలులో జరగనున్న నేపథ్యంలో ఏలూరు జిల్లా సమగ్ర అభివృద్ధిపై సదస్సును జరుపుతున్నట్టు తెలిపారు. సదస్సుకు నాయకులు డి.వి.వి.ఎస్.వర్మ, రిటైర్డ్ తహసీల్దార్ గుబ్బల నాగేశ్వరరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పాల్గొంటారన్నారు. కరపత్రాల ఆవిష్కరణలో రెడ్డి శ్రీనివాసడాంగే, శ్యామల, పొటేలు పెంటయ్య, పి.కిషోర్ పాల్గొన్నారు.


బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

11నుంచి ఫార్మేటివ్ పరీక్షలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఫార్మేటివ్ (ఎఫ్ఏ-1/ యూనిట్) పరీక్షల షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు.ఈనెల 11 నుంచి 13వరకు ప్రాథమిక తరగతుల(1-5)కు ఉదయం 9.30నుంచి 10.45వరకు, మధ్యాహ్నం 1.15నుంచి 2.30గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. సెకండరీవిద్య 6-10 తరగతులకు 11వ తేదీనుంచి 14వ తేదీ వరకు జరుగుతాయి. 9,10 తరగతులకు పరీక్షలు ఉదయం 11నుంచి 12:15వరకు, మధ్యాహ్నం 2:45నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారు.

పారబోలా నైన్ సంస్థకు రెండు జాతీయ అవార్డులు

- మంత్రి సారథికి సీఎం చంద్రబాబు అభినందన

లోపలి పేజీలో..


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

జిల్లావ్యాప్తంగా డ్రోన్లతో నిఘా

ఏలూరు క్రైం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుకు, రహదారి ప్రమాదాలను నివారించేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రివేళ పోలీసులు డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ల పరిధిలో మంగళవారం రాత్రి డ్రోన్ కెమెరాలతో రాత్రి వేళ గస్తీ నిర్వహించారు. వాహనాల తనిఖీలు, అక్రమ కార్యకలాపాల నిర్మూలన కోసం ఈ చర్యలు చేపట్టారు. అన్ని దేవాలయాలు, బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలను రాత్రి వేళ డ్రోన్ల ద్వారా పరిశీలన జరిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించడానికి ఈ డ్రోన్ల ద్వారా పరిశీలన చేశారు. రహదారులపై పోలీసులు వాహనాలను తనిఖీలను చేసి డ్రంకెన్ డ్రైవ్‌ను నిర్వహించారు.



ఆలయంలో విచారణ చేస్తున్న దేవదాయశాఖ అధికారులు

క్షేత్రస్థాయిలో మరోసారి విచారణ చేస్తాం

గూటాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నకిలీ రశీదు బుక్‌ల వ్యవహారంపై ఆర్జేసీ విచారణ

పోలవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పోలవరం మండలం గూటాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం దేవ దాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ వేంద్ర త్రినాథరావు ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన నకిలీ రశీదు బుక్‌ల విషయంలో విచారణ నిర్వహించారు. ఆలయం పేరిట దేవదాయశాఖ అనుమతులు లేకుండా నకిలీ రశీదు బుక్కులు ముద్రించి ఆలయ కమిటీ సభ్యులు రెండుకోట్ల రూపాయల వరకూ సొమ్ము స్వాహా చేశారంటూ గ్రామానికి చెందిన వ్యక్తి ఇచ్చిన సమా చారం మేరకు గత నెల 20న 'నకిలీ రశీదులపై చర్యలు తీసుకోండి' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తా కథనంతో స్పందించిన దేవదాయ శాఖ అధికారులు జూలై 22వ తేదీన విచారణ నిర్వహించారు. ఫిర్యాదుదారుడు విచారణకు హాజరు కాకపోవడంతో విచారణ వాయిదా పడింది. తాజాగా రీజనల్ జాయింట్ కమిషనర్, ఏలూరు అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాస్, ఇన్ స్పెక్టర్ ఫణి ఆధ్వర్యంలో జరిగిన విచారణలో అధికారులు ఫిర్యాదుదారుడు చవల మహేష్ స్టేట్‌మెంట్ తీసుకున్నారు. విచారణ సమయంలో గ్రామస్థులు, దేవాలయ కమిటీ సభ్యుల మధ్య కొంత వాగ్వివాదం జరిగింది. రీజనల్ జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుని స్టేట్‌మెంట్ తీసుకున్నామని రెండు కోట్ల మేర అవినీతి జరిగిందని చెప్పిన ప్రకారం తగిన రశీదులు చూపలేకపోయారన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో పునర్విచారణ చేయనున్నట్లు తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామిని దర్శించుకున్న ఏలూరు జడ్జి శ్రీదేవి



భీమవరం టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర జనార్ధన స్వామిని బుధవారం ఏలూరు జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారి కుటుంబ సభ్యుల పేరిట పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. ఈవో కృష్ణంరాజు దేవస్థానం తరుపున శేషవస్త్రం,ప్రసాదం అందించారు.

నేటి నుంచి చిన వెంకన్న పవిత్రోత్సవాలు

ఈనెల 10 వరకూ నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు

ద్వారకాతిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి దివ్య పవిత్రోత్సవాలు శ్రీవారి సన్నిధిలో గురువారం సాయంత్రం నుంచి ప్రారంభం కానున్నాయి.. 10వ తేదీ వరకూ నాలుగురోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు.ఏడాది పొడవునా ఆలయంలో తెలిసి తెలియక జరిగిన తప్పుల ప్రాయఃచిత్తం నిమిత్తం ప్రతీ ఏటా వీటిని నిర్వహించడం సంప్రదాయబద్ధంగా వస్తున్నది. ఉత్సవాల్లో భాగంగా 7 సాయంత్రం అంకురార్పణ, 8న పవిత్రాధివాసం, 9న పవిత్రారోపణ, 10న జరిగే శ్రీమహాపూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలిపారు. ఉత్సవాలు జరిగే ఆయా రోజుల్లో శ్రీవారి నిత్యార్జిత కల్యాణాలు. ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈఓ ఎన్వీ సత్యన్నారాయణమూర్తి వివరించారు. అలాగే పురాతన లక్ష్మీపురం ఆలయంలో



పవిత్రాలు ధరించిన లక్ష్మీపురం ఆలయంలోని శ్రీనివాసుని మూలవిరాట్

స్వామి వారి దివ్యపవిత్రోత్సవాలు ఈనెల 18 నుంచి 21 వరకూ నాలుగు రోజుల పాటు జరుగుతాయని ఈవో మూర్తి తెలిపారు. 18 సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమయ్యే ఉత్సవాలు 21న జరుగనున్న మహాపూర్ణాహుతి హోమంతో పూర్తి అవుతుందని భక్తులు తరలి రావాలని ఈవో కోరారు.

కుంకుళ్లమ్మకు విశేష పూజలు



ద్వారకాతిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): క్షేత్రదేవత కుంకుళ్లమ్మవారు శాకాంబరీ దేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమీయనున్నట్లు ఆలయ ఈఓ ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి తెలిపారు. ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి ఉపాలయమైన ఈ ఆలయంలో అమ్మవారు వివిధ కూరగాయల అలంకారంలో భక్తులకు దర్శనమీయను న్నారని అమ్మను దర్శించి తరించాలని కోరారు. బుధవారం సాయంత్రం విశేష పుష్పాలంకారాల్లో ఉన్న అమ్మవారికి వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ అర్చ కులు కుంకుమ పూజలు జరిపారు.

చేనేతకు చేయూత



అత్తిలి మండలం శివపురంలో మగ్గంపై వస్త్రాన్ని నేస్తున్న చేనేత కార్మికురాలు

ప్రోత్సాహమిస్తున్న కూటమి ప్రభుత్వం

గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన సొసైటీలు

పోటీ తట్టుకోలేక వేరే వృత్తుల్లోకి వెళ్లిపోతున్న కార్మికులు

నేడు జాతీయ చేనేత దినోత్సవం

తణుకు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచలోనే అతి ప్రాచీన వృత్తుల్లో చేనేత వృత్తి ఒకటి. భారతదేశం చేనేత పరిశ్రమ ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది. భారత జాతీయ ఉద్యమంలో చేనేతకు ప్రత్యేక స్థానం వుంది. మహాత్మాగాంధీ స్వయంగా రాట్నం వడికి విదేశీ వస్తు బహిష్కరణకు నాంది పలికారు. 1905 సంవత్సరం ఆగస్టు 7న కోల్‌కతాలో జరిగిన సమావేశంలో విదేశీ వస్తువులను బహిష్కరిస్తూ స్వదేశీ ఉద్యమాన్ని నిర్మించాలని తీర్మానించిన రోజును జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఎంతో ప్రాచీన వృత్తి, కళగా వున్న చేనేత దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు 2005లో ఉమ్మడి తెలుగు రాష్ట్రానికి చెందిన రాపోలు ఆనంద భాస్కర్ విశేష కృషి చేశారు. ఆయన కృషితో 2015 ఆగస్టు 7వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చెన్నైలో జాతీయ చేనేత దినోత్సవం అధికారికంగా ప్రకటించారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నారు. చేనేత వృత్తిలో నైపుణ్యం కనబర్చిన వారికి సంత్ గురుదాస్ అవార్డులను అందజేస్తున్నారు.

తగ్గుతున్న వృత్తి దారులు

చేనేత వృత్తి ఆధారంగా మొత్త రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 లక్షల మంది ఆధారపడగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 60 వేల మంది వరకూ చేనేత కార్మికులు వున్నట్లు చేనేత సొసైటీ లెక్కలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం చేనేత రంగంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా ఉమ్మడి జిల్లాలో చేనేత మగ్గాలపై పని చేసే కార్మికులు సుమారు 20 వేల వరకూ తమ వృత్తి కొన సాగిస్తున్నారు. చేనేత వృత్తి లాభసాటిగా లేక పోవడంతో ఆ వృత్తిలో కొనసాగ లేక ఇతర ఉద్యోగాలు, వృత్తులకు మారిపోతున్నారు. చేనేత వృత్తిలో వున్న ఎక్కవ శాతం వస్త్ర వ్యాపారంలోకి మారడం లేదా ఇతర వృత్తుల్లోకి మారిపోయారు. ఇటీవల కాలంలో యువత వస్త్ర ధారణలో వచ్చిన మార్పులు చేనేతకు ప్రోత్సాహకరంగా వుంటున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పంచెలు, కాటన్ షర్టులు దోవతులు, చేనేత చీరలకు ఇటీవల కాలంలో డిమాండ్ పెరిగిందని పేర్కొంటున్నారు.

నార బట్టలు కట్టుకునే విదేశీయులకు భారతీయ చేనేత కళాకారులు అందమైన మృదువైన వస్త్రాలను అందించిన ఘనత వుంది. బ్రిటన్ రాణికి సుమారు 9 మీటర్ల చీరను అగ్గిపెట్టెలో పెట్టి అందించారు. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామికి చేనేత వస్త్రాలనే బహూకరించడం సంప్రదాయం.

పూర్వ వైభవం తీసుకురావాలి



చేనేత మగ్గాలకు విద్యుత్ సబ్సిడీ ఇస్తూ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా హర్షనీయం. ఈనిర్ణయం ద్వారా లక్షలాది చేనేత కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుంది. ఒకప్పుడు ఎంతో ప్రతిష్టాత్మక వృత్తిగా వున్న చేనేతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలి. ఇప్పటికే ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు చేనేతపై వున్న జీఎస్టీని రద్దు చేసి చేనేతపై భారం తగ్గించారు. చేనేత కార్మికులకు వున్న రుణాలను రద్దు చేయాలి. చేనేత కుటుంబాలకు, చేనేత వృత్తి చేసుకునే వారికి రుణ పరపతి పెంచాలి. చేనేత సహకార ఆర్థిక సంస్థలో ఏడీఏ వంటి ఉద్యోగులను చేనేత కులాల వారినే నియ మించాలి. చేనే తలకు విద్యుత్ సబ్సిడీ, ఇతర ముడి సరుకులలో సబ్సిడీలను అందించాలి. పేద చేనేత కుటుంబానికి 3 సెంట్ల నివాస స్థలాలను ఇవ్వాలి. చేనేత పరిశ్రమకు ప్రోత్సాహకాలు అందించాలి.

-వావిలాల సరళాదేవి, రాష్ట్ర చేనేత ఆర్థిక సహకార సంస్థ మాజీ చైర్మన్, తణుకు

కొన్ని రకాల వస్త్రాలు రిజర్వు చేయాలి



నేటి వస్త్ర పరిశ్రమలో వస్తున్న అనేక పోటీ వస్తువులను తట్టుకునేందుకు ప్రభుత్వం కొన్ని రకాల వస్త్రాలను చేనేత రంగానికి కేటాయించి వాటికి ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలి. గతంలో 11 రకాల వస్త్రాలను ప్రభుత్వం చేనేతలకు కేటాయించారు. ప్రస్తుతం అది అమలు కావడం లేదు. ఇప్పుడు వాటిలో కనీసం ఐదు వస్త్రాలనైనా చేనేతలకు కోసం కేటాయించాలి. చేనేత కుటుంబాలకు వర్షాకాలంలో పని లేని రోజుల్లో భత్యంగా ఇచ్చే రూ.24 వేల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అమలు చేయాలి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిర్వీర్యమై పోయిన చేనేత సొసైటీలకు నిధులు కేటాయించి ఆదుకోవాలి. చేనేత కార్మికుల ఆరోగ్య, బీమా పథకాలను పునరుద్ధరించాలి.

-గుడిమెట్ల మల్లేశ్వరరావు,శివపురం చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు, అత్తిలి మండలం

చెత్తకు మోక్షం

జంగారెడ్డిగూడెం డంపింగ్ యార్డు వద్ద రీసైక్లింగ్ యంత్రం



వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ ఫలితాలు

స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా రూ.1.36 కోట్లు

జంగారెడ్డిగూడెం డంపింగ్ యార్డులో మూడు నెలల్లో 18,736 మెట్రిక్ టన్నుల వ్యర్థాల రీసైక్లింగ్

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. దీనిలో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా జంగారెడ్డిగూడెం పట్టణంలోని డంపింగ్ యార్డులో చేపట్టిన వ్యర్థాల నిర్వహణతో ఉత్తమ ఫలితాలు కనిపిస్తున్నాయి. దాదాపు 20 సంవత్సరాల నుంచి డంపింగ్ యార్డులో ఎనిమిది అడుగులకు పైగా పేరుకుపోయిన వ్యర్థాలను (లెగసీ వేస్ట్) రీసైక్లింగ్ చేయడంతో అపరిశుభ్రంగా ఉన్న డంపింగ్ యార్డులో నేడు పరిశుభ్రమైన వాతావరణం కనిపిస్తున్నది. పట్టణంలోని 29 వార్డుల నుంచి ప్రతీ రోజు 20 టన్నుల తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరించి స్థానిక బైనేరు వంతెన వద్ద ఉన్న డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి సంస్థ కింద పనిచేసే స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్‌కు స్థానిక డంపింగ్ యార్డు వద్ద ఉన్న వ్యర్థాలను వేరు చేయడానికి ప్రభుత్వం రూ. 1.36 కోట్లు మంజూరు చేసింది. దీనిలో అర్బన్ లోకల్ బాడీ షేర్ (యుఎల్‌బీ) కింద జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 51 లక్షలు మంజూరు చేశారు. గుంటూరుకు చెందిన అవినాశ్ ఏజెన్సీ వారు కాంట్రాక్టును పొంది ఫిబ్రవరి నెలలో చెత్తను వేరు పరిచే రీసైక్లింగ్ చేసే పరికరాలను జంగారెడ్డిగూడెం డంపింగ్ యార్డు వద్ద అమర్చి పనులు ప్రారంభించారు. మొత్తం 58 వేల 736 మెట్రిక్ టన్నులకు మే నెలాఖరుకి 18,736 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేశారు. మిగతా 33 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను అక్టోబర్ నెలలో పూర్తిచేస్తారు.

తడి, పొడి చెత్త, రాళ్లు, మట్టి, ప్లాస్టిక్, వేస్ట్ క్లాత్‌లను రీ సైక్లింగ్ యంత్రంలో వేయడంతో ఆ యంత్రం ఏ భాగానికి ఆ భాగం వేరు చేస్తుంది. వచ్చిన మెటీరియల్ లో మట్టిని పట్టణంలో లోతట్టు ప్రాంతాలను పూడ్చడానికి ఉపయో గించారు. రాళ్లను రోడ్ల నిర్మాణానికి ఉపయోగించారు. ప్లాస్టిక్, క్లాత్‌లతో వచ్చిన వేస్ట్‌ను గుంటూరు జిందాల్ విద్యుత్ ప్లాంట్‌కు పంపించారు.

స్వచ్ఛ జంగారెడ్డిగూడెం లక్ష్యం



స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ సహకారంతో డంపింగ్ యార్డులో 18,736 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేశాం. డంపింగ్ యార్డు పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండేందుకు మొక్కలు నాటి పార్కుగా అభివృద్ధి చేస్తాం. అక్టోబర్ 2 నుంచి డంపింగ్ యార్డులో చెత్తను ఎప్పటి కప్పుడు రీ సైక్లింగ్ చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. అందుకోసం చిన్న చిన్న యంత్రా లను అందచేయనున్నది. ప్లాస్టిక్, క్లాత్‌లను రీసైక్లింగ్ చేయగా వచ్చిన వేస్ట్‌ను త్వరలో రాజమండ్రిలో పూర్తికావస్తున్న పవర్ ప్లాంట్‌కు పంపుతాం. ప్రభుత్వం యాభై శాతం సబ్సిడీతో పట్టణానికి రూ.70 లక్షల విలువైన స్వీపింగ్ మెషిన్, చెత్తను తరలించడానికి రూ.65 లక్షలతో కాంపాక్టర్‌ను ఇవ్వనుంది. ఇళ్ల నుంచి చెత్తను సేకరించడానికి అద్దె ప్రాతిపదికన పదమూడు ఈ-ఆటోలు కేటాయించారు. స్వచ్ఛ జంగా రెడ్డిగూడెంగా చేయడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నాం.

- కెవి.రమణ,మున్సిపల్ కమిషనర్, జంగారెడ్డిగూడెం

సంపద కేంద్రాల మాటేమిటి ?

పెనుగొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా మూలన పడ్డ సంపద తయారీ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం రావడంతో వాటికి మోక్షం లభించే రోజులు వచ్చినట్లు భావించారు. కాని ఇంకా ఎక్కడా అమల్లో కనిపించడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో చెత్తను పోగు చేసి దానిని వర్మి కంపోస్టు తదితర పని కొచ్చే పదార్థాలుగా తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం రాబట్టేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా సుమారు రూ.20 లక్షలతో ఆయా గ్రామాల్లో షెడ్లు నిర్మించారు. అప్పట్లో 1, 2 సంవత్సరాల పాటు ఈ కేంద్రాలు వద్ద కార్యకలాపాలు నిర్వహించినప్పటికి అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని పక్కన పెట్టాయి. దీంతో ఆ కేంద్రాల చుట్టు తుప్పలు పెరిగిపోయి కేంద్రాల దగ్గరకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. గ్రామాల్లో పోగు చేసిన చెత్త చెదారాన్ని అక్కడక్కడ గుట్టలుగా పోయడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొనేది. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో వేయకుండా సంపద కేంద్రాలకు తరలించి అక్కడి నుంచి సంపద తయారు చేయాలనే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. పవన్ కల్యాణ్ పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఈ కేంద్రాలపై దృష్టి పెడతారనే ఉద్దేశంతో తుప్పలు, పిచ్చిమొక్కలతో నిండిపోయిన సంపద కేంద్రాలు వద్ద శుభ్రం చేయించారు.



పెనుగొండలో అందంగా తీర్చిద్దిన సంపద తయారీ కేంద్రం



ఆకివీడులోని మత్స్యశాఖ కార్యాలయం

మత్స్యశాఖ పనిచేస్తోందా.. ?

ఆకివీడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆకివీడులో మత్స్యశాఖ పనిచేస్తోందా ? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు ఆక్వా రైతులు.. అయి-భీమవరం రోడ్‌లో ఉన్న మత్స్యశాఖ కార్యాలయం గత శనివారం వెళితే తాళాలు వేసి ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో లక్షలు వెచ్చించి మత్స్యశాఖ కార్యాలయం నిర్మించారు. ఈ కార్యాలయంలో అధికారులు సక్రమంగా ఉండడం లేదని ఆక్వాకు సంబంధించిన ల్యాబ్ తదితర పరీక్షలు అడపాదడపా చేయడం తప్ప నిత్యం చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకుంటే వేలకు వేలు డబ్బులు అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఆక్వా సమస్యలపై తెలుసుకుందామంటే అధికారి, సిబ్బంది ఉండరని అడిగితే క్యాంపులపై బయటకు వెళుతున్నామని చెబుతుంటారని రైతులు ఆగ్రహిస్తున్నారు. ఈ కార్యాయలంలో సమాధానం చెప్పే నాథుడే ఉండడం లేదని అధికారులు దృష్టి పెట్టి సమస్య పరిష్కరించాలని ఆక్వా రైతులు కోరుకుంటున్నారు.



దుంపగడపలో నిర్మాణం మధ్యలో ఆగిపోయిన తరగతి గది

అసంపూర్తి భవనాలతో ఇబ్బందులు

మధ్యలోనే ఆగిపోయిన నాడు-నేడు తరగతి గదులు

ఆకివీడు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నిధులు మంజూరు కాక మధ్యలోనే తరగతి గదుల నిర్మాణం నలిచిపోయి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. నాడు-నేడు రెండోవిడత కార్యక్రమంలో గత ప్రభుత్వం ఆకివీడు మండలంలోని 30 పాఠశాలలకు రూ. 10.93 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీనిలో రూ.5.35 కోట్లు విడుదల చెయ్యగా, పేరెంట్స్ కమిటీ ఖాతాకు రూ.3.02 కోట్లు జమ అవ్వగా మిగిలినది ఇసుక, సిమెంట్ ఇతరత్రా కాంపోనెంట్స్‌కు జమయ్యాయి. ఇంకా రూ.5.58 కోట్లు నిధులు విడుదల అవకపోవడంతో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఆకివీడు మండలం దుంపగడపకు జడ్పీ పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు సుమారు 270 మంది ఉన్నారు. వీరికి సరిపడా తరగతి గదులు లేవు. నాడు-నేడులో 2021లో రెండు తరగతి గదులు నిర్మాణానికి రూ.24 లక్షలు మంజూరు చేయగా రూ.8 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. ఇక్కడ బేస్‌మెంట్ మాత్రమే పూర్తి అయ్యింది. శిథిలావస్థకు చేరిన చెరుకుమిల్లి, తాళ్లకోడు, నందమిల్లిపాడు, అప్పారావుపేట గ్రామాలలో ఎంపీపీ పాఠశాలల్లో నూతన భవనాల నిర్మాణానికి ఒక్కొ భవనానికి రూ.43 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఒక్కొ తరగతి గది నిర్మాణం పూర్తి అయ్యింది. రంగులు, తలు పులు, కిటికీలు, కొన్నిచోట్ల టైల్స్ వెయ్యాల్సి ఉంది. చేసేది లేక అవే గదులలో తరగతులు నడుస్తున్నాయి. జడ్పీ పాఠశాలలో సైతం నిధులు మంజూరై పనులు ఆగిపోయాయి. పనులు ఏ స్థాయిలో ఆగిపోయాయో ఉన్నతాధికా రులకు ఆయా పాఠశాలల హెచ్ఎం నివేదికలు అందజేశారు.



కళింగపాలెంలో స్లాబ్ వేసి ఆగిపోయిన తరగతి గదులు

ప్రోబ్లమ్ జోన్



కోరుకొల్లు రైతు సేవా కేంద్రం వద్ద వంటలు వండుకుంటున్న కూలీలు

నిరుపయోగంగా రైతు సేవా కేంద్రం

అద్దె భవనంలో నిర్వహణపై గ్రామస్థుల ఆగ్రహం

పాలకోడేరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్నట్లు రైతుల కోసం రైతు సేవా కేంద్రాన్ని నిర్మించినా ఆ భవనాన్ని కాదని అద్దె భవనంలో రైతు సేవా కేంద్రాన్ని నిర్వహించడం పట్ల ఇదేమిటని గ్రామ టీడీపీ నాయకుడు గాదిరాజు శ్రీనివాసరాజు, పలువురు గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. కోరుకొల్లు గ్రామంలో రైతుల ప్రయోజనార్థం రైతు సేవా కేంద్రాన్ని సుమారు ఏడాది క్రితమే నిర్మించారు. అయితే ఆ భవనాన్ని ప్రారంభించకుండా అద్దె భవనంలో రైతు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల శ్రీనివాసరాజు గత కొంత కాలంగా ఆగ్రహిస్తూ వస్తున్నారు. ఇదే తరుణంలో గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రం భవనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నా ఆ భవనాన్ని ప్రారంభించకుండా అదే భవనంలో కూలీలకు ఆశ్రయం ఇవ్వడం పట్ల ఆయన మండల అధికారులకు ఫొటోలు పెట్టి తెలియపరిచారు. అసలే పంచాయతీకి అంతంత మాత్రంగా ఆదాయ వనరులు ఉన్న సమయంలో ఉన్న సొమ్మును వేరే ప్రజలకు ఉపయోగపడే వాటికి వినియోగించకుండా రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించకుండా వదిలివేయడం దారుణమని ఆరోపించారు. ఇదే విషయంపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు దృష్టికి కూడా తీసుకువెళ్తానని వివరించారు.



బేస్‌మెంట్‌లో ఆగిపోయిన ఇలపర్రు సచివాలయ భవనం

సచివాలయ భవనాలు పూర్తయ్యేనా ?

పెనుగొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సత్వర సేవలు ప్రజలకు అందించేందుకు గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. ప్రతీ గ్రామంలో స్థల సేకరణ చేసి సచివాలయ భవన నిర్మాణాలు చేట్టారు. పెనుగొండ మండలంలో 18 సచివాలయాలు భవన నిర్మాణాలకు చర్యలు తీసుకున్నారు. 10 భవనాలు పూర్తయి ప్రారంభోత్సవాలు కూడా చేశారు. మిగిలిన భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఒక్కొ భవనానికి రూ. 45 లక్షలు వ్యయంతో నిర్మాణాలు చేపట్టిన కొన్నిచోట్ల నిధులు మంజూరు కాక పోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇలపర్రు సచివాలయ భవనం అసంపూర్తిగా ఉండిపోవడంతో క్షత్రియ యువజన సంఘ భవనంలో ఇరుకుగా ఉన్నా గదుల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనంలోనే పోస్టాఫీసు కూడా ఉండటం విశేషం. దీంతో సచివాలయానికి వచ్చే పలువురు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రేపటి నుంచి క్రీడా పోటీలు

భీమవరం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా జోనల్, రాష్ట్ర స్థాయిలో అండర్-22 క్రీడా పోటీలు జిల్లాలో ఈనెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలపై ఈనెల 29న హాకీ లెజెండ్ మేజర్ ధ్యానచంద్ పుట్టిన రోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పది విభాగాలలో క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు తణుకులో జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. 14 సంవత్సరాలు పైబడి 22 సంవత్సరాలు లోబడి ఉన్న బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, బ్యాంకు ఖాతా బుక్ జిరాక్స్ అందించాలన్నారు.



యూజీసీ అటానమస్ పత్రం చూపిస్తున్న కళాశాల యాజమాన్యం

సీఎస్ఎన్ డిగ్రీ, పీజీ కళాశాలకు యూజీసీ అటానమస్ స్టేటస్

భీమవరం రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భీమవరం సీఎస్ఎన్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు యూజీసీ అటానమస్ స్టేటస్ సర్టిఫికెట్‌ను అందించిందని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ముత్యాల రత్నం, డాక్టర్ చీడే సత్యనారాయణ తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ విద్య సంస్థలో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు వివిధ రకాల కోర్సులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. 1991లో విద్యా సంస్థను ప్రారంభించగా 1992లో ఇంగ్లిష్ మీడియం స్కూల్, 1994లో డిగ్రీ, 2000లో పీజీ కళాశాల, 2008లో ఫార్మసీ, 2012లో డీఎడ్, 2024లో నాక్ 'ఏ' గ్రేడ్ వచ్చాయని, యూనివర్సిటీ స్థాయికి కళాశాల చేరుకుందన్నారు. పదేళ్లపాటు (2025-2034) కళాశాలకు స్వయం ప్రతిపత్తి అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు అత్యాధునిక సదుపాయాలను అందిస్తూ 20 ఏళ్ల అనుభవం కలిగిన అధ్యాపకులతో మెరుగైన బోధన కల్పిస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సకుమళ్ళ సత్యనారాయణ మాట్లాడుతూ డిగ్రీలో బీఎస్సీ, బీకాం, పీజీలో ఎంఎస్సీ వంటి ఎన్నో కోర్సులతో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. పాలకవర్గ సభ్యులు వడుపు గోపి, గాదిరాజు సత్యనారాయణరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉల్లాస్ అక్షరాంధ్ర వలంటీర్ల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి సత్యనారాయణ

నిరక్షరాస్యుల కోసం 'ఉల్లాస్ అక్షరాంధ్ర'

తణుకు రూరల్, అగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తణుకు మండలంలో స్వయం సహాయక సంఘాల్లో వున్న 2500 నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ఆగస్టు నుంచి మార్చి నెలవరకూ ఉల్లాస్ అక్షరాంధ్ర అక్షరా స్యత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి కేవీవీ సత్యనారాయణ చెప్పారు. బుధవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ అక్షరాంధ్ర వలంటీర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తణుకు మండలంలోని డీఆర్‌డీఏ గ్రూపులలో వున్న నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పేందుకు 250 మంది వలంటీర్లను నియమించినట్లు తెలిపారు. వీరంతా ఈనెల నుంచి వచ్చే సంవత్సరం మార్చి వరకూ అక్షరాలు నేర్పిస్తారని, మార్చినెల చివరి వారంలో వారందరికీ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.డీఆర్‌డీఏ ఏపీఎం రామకృష్ణ, ఎంపీడీవో కార్యాలయ ఏవో కృష్ణ చంద్రరావు, విద్యాశాఖ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

9న ఏలూరులో శ్రీశ్రీ కళావేదిక సింగర్స్ ఫెస్ట్

ఏలూరు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక నిరంతరం సాహిత్య క్రతువులో భాగంగా అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారధ్యంలో ఆగస్టు 9న ఏలూరులో సింగర్స్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు శ్రీశ్రీ కళావేదిక నేషనల్ ప్లానింగ్ అధికారి, జాతీయ ప్రధాన కార్యదర్శి ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ టి.పార్థసారధి తెలిపారు.ఏలూరులో శ్రీశ్రీ కళావేదిక ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీహరి కోటి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్థసారధి మాట్లాడుతూ ఈనెల 9న మహాలక్ష్మీ గోపాలస్వామి కళ్యాణ మండపంలో వందమంది సింగర్స్‌తో నాన్ స్టాప్ ట్రాక్ సింగింగ్ పేరిట బిగ్ ఈవెంట్ నిర్వహించి సింగర్స్ అందరికి స్వర కిరీటి బిరుదు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లాశాఖ కన్వీనర్ జి.కృష్ణ మనోహర్, ఉపాధ్యక్షుడు కస్తూరిరావు, కోకన్వీనర్ సుజయ్‌కృష్ణ, మహిళా అధ్యక్షురాలు శ్యామల హరికోటి, కార్యదర్శులు ఐజక్, సూర్యప్రకాష్, యజ్ఞ ప్రసాద్, చంద్రు, గౌరవ సభ్యుడు రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరులో స్కూలును సందర్శించిన ఇటలీ టూరిస్టులు



ఏలూరు అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : భారతదేశం లోని వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలు, సంస్కృతులను ప్రత్యక్షంగా తెలుసుకునే క్రమంలో ఇటలీ దేశానికి చెందిన అలె గ్జాండర్, జార్జా, క్యార, బెనదత్త బుధవారం ఏలూరు లోని ఓ ప్రైవేటు స్కూలును సందర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు చైతన్యం కలిగి ఉన్నారని, గ్రామీణ ప్రాంతాల్లోసైతం ఆధునిక సౌకర్యాలు, సాంకేతికత అందుబాటులో ఉందన్నారు. దేశంలో ఇంకా కొన్ని రాష్ట్రాలు వెనుకబడి ఉన్నాయని, ముఖ్యంగా బిహార్, ఒడిశా వంటి రాష్ట్రాలు అభివృద్ధి సాధించాల్సి ఉందన్నారు. స్కూలు సందర్శనకు గుర్తుగా వారితో మొక్కను నాటించారు. స్కూలు డైరెక్టర్ టి.ఎడ్వర్డ్, సీహెచ్ కుమార్, ఫాదర్ తోట ఆంథోని, సీహెచ్ ఉష, తదితరులున్నారు.

భయం.. భయం..


పాలకొల్లులో టిడ్కో గృహాల కాలనీ

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా 'పాలకొల్లు టిడ్కో గృహాల కాలనీ'

» విచ్చలవిడిగా మైనర్లు గంజాయి సేవనంతో హల్‌చల్ » సాయంత్రమైతే హడలిపోతున్న ప్రజలు

పాలకొల్లు టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):పట్టణంలో టిడ్కో గృహాల కాలనీలో నిత్యం ప్రజలు భయం.. భయంగా జీవనం గడుపుతున్నారు. మైనర్లు సైతం గంజాయి సేవించి చుట్టుపక్కల ఉండే వారితో నిత్యం తగువులు పడుతున్నారు. వీటితోపాటు కొన్ని ఇళ్ల వద్ద గుట్టుచప్పుడు కాకుండా కొంతమంది వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇక్కడికి కొందరు గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకుని మైనర్ బాలురకు గంజాయి తాగే అలవాటు చేసి ఒక బ్యాచ్‌గా ఏర్పాటు చేసి దందాలు నిర్వహిస్తున్నట్టు స్థానికులు వాపోతున్నారు. ఈరోడ్డు వెంబడి కొత్తపేట, గోరింటాడ, సగం చెరువు గ్రామస్థులు నరసాపురం పట్టణానికి ద్విచక్రవాహనాలపై అధిక సంఖ్యలో వెళ్లి వస్తుంటారు. సాయంత్రం సమయంలో అటుగా వచ్చే వారిని సదరు బ్యాచ్ అడ్డగించి భయభ్రాంతాలకు గురిచేసి బ్లేడుతో చేతులపై గాయాలు చేస్తున్నారు. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారిని గుర్తించి మైనర్లు కావడంతో కౌన్సెలింగ్ ఇచ్చి పంపిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ వీరి ధోరణి మారడం లేదని చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి వెళ్లే వారు వాపోతున్నారు. పట్టణ పోలీసులను గస్తీని ఏర్పాటు చేసి పెట్రోలింగ్ నిర్వహించినా వీరి ఆగడాలకు అంతులేకుండా పోతుందని, ఇప్పటికే తమ ఇళ్లను అద్దెలకు ఇచ్చి పట్టణ ప్రాంతానికి అద్దె ఇళ్లలోకి వెళ్లి పోతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మొత్తంగా చూస్తే టిడ్కో ఇళ్లలో నివసించే వారిలో గొడవలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేసే వారి సంఖ్య ఎక్కువగానే ఉందని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు.

● ఈ రోడ్డులో ప్రైవేట్ కల్యాణ మండపం ఉండడంతో పెళ్లిళ్లకు బంగారు వస్తువులు వేసుకుని రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. గతంలో ఇక్కడ పెళ్లికి వచ్చిన ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు దుండగులు లాక్కుని వెళ్లిన సంఘన జరిగింది. స్థానిక మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు టిడ్కో ఇళ్లల్లో నివాసం ఉండే వారికోసం ఆ ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. ఇలా ఆకతాయిల బెడద వల్ల ఈ కాలనీ ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. వారికి పట్టణ పోలీసులు శాశ్వత ప్రణాళిక రూపొం దించి, అక్కడ జరుగుతున్న ఆగడాలను నివారించి, ప్రతీ వీధికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసులు కఠినంగా వ్యవహరించాలి



టిడ్కో గృహాలలో నివాసం ఉంటున్న ప్రజలకు పోలీసులు భరోసా కల్పించాలి. ప్రభుత్వం ఇచ్చిన సొంత ఇంటిలో నివసించే వారు ఆనందంగా ఉండాలంటే దుండగులు, ఆకతాయిల పట్ల పోలీసులు కొంత కఠినంగా వ్యవహరించాలి. మైనర్ బాలురు గంజాయి, మత్తు పదార్థాలను సేవిస్తూ విచ్చలవిడిగా హల్‌చల్ చేస్తుంటే పోలీలు పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపడం సరికాదు, సీసీ కెమోరాలు ఏర్పాటు చేయాలి.

- ఎస్.రాంబాబు, టిడ్కో గృహాల కాలనీ నివాసి, పాలకొల్లు



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

నేటి బాలలే భావి భారత పౌరులు

ఏలూరు క్రైం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):నేటి బాలలే భావిభారత పౌరులు అని, బాలల స్నేహపూర్వక న్యాయ అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. 'బాలల స్నేహ పూర్వక న్యాయ సేవలు పథకం 2024'పై బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో ఏలూరు శాంతినగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఒలింపియాడ్ స్కూలు విద్యార్థు లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు విద్యార్థి దశలోనే చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకుని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులే లక్ష్యంగా సంఘ విద్రోహ శక్తులు మానవ అక్రమ రవాణా, డ్రగ్స్ విక్రయం వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నాయని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాలలకు అవసరమైన పక్షంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీడబ్ల్యూసీ ఇన్‌చార్జి ఛైర్మన్ పి.వెంకటేశ్వరరావు, న్యాయవాది పి.రత్నరాజు, ఆక్స్‌ఫోర్డ్ ఒలింపియాడ్ స్కూల్ ప్రిన్సిపాల్ పసుపులేటి సునీల్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పారబోలా నైన్ సంస్థకు రెండు జాతీయ అవార్డులు

» మంత్రి సారథికి సీఎం చంద్రబాబు అభినందన


మంత్రి పార్థసారథిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

నూజివీడు టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో స్టార్టప్ సంస్థగా ప్రారంభమైన అమెరికాకు చెందిన పారబోలా నైన్ ఏఐ సంస్థ జాతీయ హాకథాన్‌లో రెండు జాతీయ అవార్డులను పొందింది. ఈ నేపథ్యంలో ట్రిపుల్ ఐటీలోని పారబోలా సంస్థ ఏర్పాటుకు కృషిచేసిన మంత్రి కొలుసు పార్థసారథిని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం అమరావతిలో అభినందించారు. జాతీయస్థాయిలో నిర్వహించిన హాకథాన్‌లో పోలీస్‌శాఖ, సివిల్ సప్లైస్ శాఖకు సంబంధించి సంస్థ ఇచ్చిన ఏఐ టెక్నాలజీ జాతీయస్థాయిలో అవార్డులను అందుకుంది. పారబోలా సంస్థ జాతీయ అవార్డులను పొందిన విషయాన్ని మంత్రి సారథి సీఎం దృష్టికి తీసుకువెళ్లగా నూజివీడు నియోజకవర్గాన్ని వ్యవసాయ పారిశ్రామిక, సమాచార సాంకేతిక రంగాల్లో రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉండేలా కృషిచేయాలని అందుకు సంబంధించి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి సారథికి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.


ఏలూరు ర్యాలీలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జడ్పీ సిబ్బంది

ఇంటింటా జాతీయ జెండా ఎగురవేద్దాం

» జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

జడ్పీ కార్యాలయం నుంచి హర్‌ఘర్ తిరంగా ర్యాలీ ప్రారంభం

ఏలూరుసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ పతాకాన్ని ఇంటింటా ఎగురవేయడం దేశభక్తి ప్రదర్శనకు నిదర్శనమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల ఐదో తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న హర్‌ఘర్ తిరంగా ఉద్యమంలో భాగంగా బుధవారం ఏలూరు జడ్పీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఆమె ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా మనం దేశాన్ని ప్రేమిస్తున్నామన్న సందేశం ప్రపంచానికి తెలియజేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుం టోందన్నారు. ప్రభుత్వ శాఖలపై త్రివర్ణ పతాకాల ఆవిష్కరణ, పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలపై జాతీయ పతాకాలను ఎగురవేయటం, ప్రజల్లో చైతన్యం కోసం ర్యాలీలు, పాటలపోటీలు, నినాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, టీడీపీ నేత ఘంటా ప్రసాదరావు, జడ్పీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పేలుడు పదార్థాల కేసులో ముగ్గురి అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

పెనుమంట్ర, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆక్వా చెరువుల వద్ద పక్షులను తరిమికొట్టడానికి వినియోగిస్తున్న ఆయుధాలు, పేలుడు పదార్థాలపై పోలీసులు అటవీశాఖ అధికారులు తనిఖీ చేశారు. పొలమూరు గ్రామానికి చెందిన చింతపల్లి గురుప్రసాద్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో తనిఖీలు చేశారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ముగ్గురిని అరెస్ట్ చేసి 5 నాటు తుపాకులు, 10 కేజీల గన్ పౌడర్, మూడు కేజీల పిస్టోళ్లు స్వాధీనం చేసుకున్నారు. సోనురావు, సంతోష్, జై సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. 50 ఎకరాల ఆక్వా చెరువలు సాగు చేస్తున్న వేటూరి నారాయణరాజుపై కేసు నమోదు చేశారు.

నా కుమారుడి చేతి వేళ్లు పోయాయి



గత వేసవి సెలవుల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న నా కుమారుడు రెల్లి శివ గణేశ్ బ్రాహ్మణచెరువు రహదారి పక్కన పడిఉన్న డబ్బా చేతిలోకి తీసుకున్నారు. డబ్బా ఊపడంతో ఒక్కసారిగా పేలడంతో కుడిచేయి వేళ్లు తెగిపోయాయి. పేలుడుపై ఆరా తీసినా తెలియలేదు. పొలమూరు శివారులో ఆక్వా చెరువులపై పేలుడు పదార్థాలు ఉపయోగిస్తున్నారని తెలిసినా నిర్ధారణ కాలేదు. తాజా సంఘటనతో మా అబ్బాయి ప్రమాదానికి ఆక్వా రైతుల పేలుడు పదార్థాలు కారణమని భావిస్తున్నాం.

- రెల్లి శ్రీనివాస్, పొలమూరు

కాలువలో గల్లంతైన వృద్ధురాలు మృతి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం జువ్వలపాలెంకు చెందిన రావి చంద్రావతి (75) క్యాన్సర్‌తో బాధపడుతూ మనస్థాపంతో కాలువలో దూకింది. అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యల్లో బుధవారం మృతదేహం బయట పడింది. అగ్నిమాపక అధికారి పర్యవేక్షణలో మంగళవారం గాలింపు చర్యలు ప్రారంభించగా బుధవారం ఆమె మృతదేహాన్ని గుర్తించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఆది ప్రసాద్ తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళుతున్న వృద్ధుడిని లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురై విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం కలకుర్రు గ్రామానికి చెందిన భలే వెంకటరావు (50) బుధవారం ఉదయం తన గ్రామం నుంచి మోటారు సైకిల్‌పై ఏలూరు వస్తున్నాడు. ఏలూరు నుంచి కైకలూరు వైపు వెళుతున్న లారీ మార్గమధ్యలో శ్రీపర్రు గురకలపేట వద్ద వెంకటరావు మోటారు సైకిల్‌ను ఢీకొంది. వెంకటరావు తీవ్ర గాయాలకు గురికాగా విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెంటనే తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఉండి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఉండి పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సింగిరికొండ వేణుగోపాల్(50) ఆక్వా చెరువులకు మేత సరఫరా చేస్తాడు. ఈనెల 3న హైదరాబాద్ నుంచి ఉండి వచ్చిన అతను ఆకివీడుకు చెందిన ఎర్రా నరసింహారావుకు ఫోన్ చేసి ద్విచక్ర వాహనంపై వస్తే గణపవరం వెళదామని చెప్పాడు. వారిద్దరు కలిసి ఉండి నుంచి గణపవరం వెళుతుండగా థర్మాకోల్ ఫ్యాక్టరీ సమీపంలో వేణుగోపాల్‌కు ఫోన్ వచ్చింది. వాహనం ఆపి మాట్లాడుతుండగా అదే సమయంలో ఉండి నుంచి గణపవరం వెళుతున్న ద్విచక్ర వాహనదారు వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వేణుగోపాల్ తలకు తీవ్రగాయాలు కావడంతో అతడిని భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ వేణుగోపాల్ బుధవారం ఉదయం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

అద్దె ఇంటి యజమానికి టోకరా

నగదు, బంగారు, కారుతో పరారు

ఏలూరు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో అద్దెకు దిగిన కుటుంబం ఇంటి యజమానురాలికి మాయమాటలు చెప్పి నగదు, బంగారం, కారు తీసుకుని పరారయ్యారు. ఏలూరులోని అమీనాపేట ఏటిగట్టు ప్రాంతానికి పీబీఎస్ఎస్ ప్రభావతి అలియాస్ భాను ఇంటి రెండో అంతస్తులో జూన్ 22న పోచర్ల గణేష్ (30) తన కుటుంబంతో అద్దెకు దిగాడు. ప్రభావతితో కుటుంబ స్నేహం పెంచుకుని మాయ మాటలు చెప్పి ఆమె వద్ద రూ.25 లక్షలు తీసుకున్నాడు. బంగారు గొలుసు, చెవి పోగులు కూడా పది రోజుల్లో ఇస్తానని తీసుకున్నాడు. ఆమె కారు కూడా తీసుకుని ఆపై కనిపించకుండా వెళ్లిపోయాడు. గణేశ్ తల్లిదండ్రులు నిర్మల, రఘుబాబు కూడా ఆమె వద్ద డబ్బులు తీసుకుని మోసగించారు. ఈ ముగ్గురిపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో సీఐ వి కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

భీమవరం క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన దాడులలో బెల్ట్ షాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. భీమవరం రూరల్ మండలం లోసరి గ్రామంలో పి.దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద 8 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.బలరామరాజు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పి.ఉమామహేశ్వరరావు, పి.సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

దుకాణం తొలగించారని ఆత్మహత్యాయత్నం

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తన దుకాణాన్ని తొలగించారని మనస్తాపానికి గురైన వ్యక్తి పురుగుల మందు తాగడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామానికి చెందిన దొబ్బిడి పెద్దిరాజు దూబచర్లలో కొబ్బరి బొండాలు, చెరుకు రసం, చిల్లర దుకాణం నిర్వహిస్తున్నారు. పక్కనే షాపింగ్ కాంప్లెక్స్ ఉండడంతో పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ అధికారులు గత నెల 30న దుకాణాలను తొలగించారు. దీనితో పెద్దిరాజు పురుగులమందు తాగాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ప్రభుత్వాసుపత్రిలో బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి బంధువులు ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. నల్లజర్ల సీఐ, ఎస్ఐ, సిబ్బంది మృతుని బంధువుల నుంచి వాగ్మూలం నమోదు చేశారు. మృత దేహాన్ని మార్చురీలో ఉంచారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఒక యువకుడు పురుగుల మందు తాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం పోణంగి గ్రామానికి చెందిన కలపర్తి శేషయ్య (35)కు భార్య గతంలో విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. ఒంటరిగా జీవిస్తున్న శేషయ్య తల్లి, పిన్ని వద్ద డబ్బులు తీసుకుంటూ ఉంటాడు. ఇదే విధంగా జాలిపూడిలో తల్లి వద్దకు ఈనెల 5న వెళ్లి రూ.200 తీసుకున్నాడు. శ్రీపర్రులో పిన్ని వద్ద కూడా డబ్బులు తీసుకున్నాడు. శ్రీపర్రు కాల్వ గట్టు వద్ద పురుగుల మందుతాగి తన పిన్ని వద్దకు వెళ్లి చెప్పాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.

తాతయ్య మందలించాడని

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తాతయ్య మందలించడంతో బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పెదవేగి మండలంలో హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలిక (15) తల్లిదండ్రులు ఊరు వెళ్లారు. తాతయ్య వద్ద ఉంటున్న బాలిక మూడు రోజుల నుంచి పాఠశాలకు వెళ్లడంలేదు. తాతయ్య మందలించడంతో మనస్తాపానికి గురైన బాలిక పొలంలో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

భార్యాభర్తల మధ్య గొడవ

మహిళ ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగి విభేదాలు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఒక మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మండవల్లి మండలం ప్రత్తిపాడు గ్రామానికి తేరా సుధారాణి (35)కు ఆమె భర్త రమేష్‌కు మధ్య ఈనెల 5న గొడవ జరిగింది. ఈనేపథ్యంలో పురుగుల మందు తాగింది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందింది. మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. ఈ సంఘటనపై మండవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాయీ బ్రాహ్మణులకు 50 యూనిట్లు విద్యుత్ పెంపు

చింతలపూడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు 150 నుంచి 200 యూనిట్లు విద్యుత్ ఇవ్వడానికి కాబినెట్ కమిటీ ఆమోదంపై జిల్లా నాయీ బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు కొప్పెర్ల నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 150 యూనిట్లు మాత్రమే ఇచ్చిందని, కూటమి ప్రభుత్వం 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వడం హర్షణీయమని రాష్ట్ర వ్యాప్తంగా నాయీ బ్రాహ్మణులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

10న చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ఏలూరు రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పడమర వీధి విజ్ఞాన విహార స్కూల్‌లో ఈనెల 10న జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అండర్ 13 విభాగంలో బాలికలకు ఓపెన్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ వేల్పూరీ వాసుదేవరావు బుధవారం తెలిపారు. జిల్లాలోని చెస్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరింత సమాచారానికి 9553987398 నెంబర్లలో సంప్రదించవలసినదిగా కోరారు.


స్టెనోగ్రాఫర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్ డీవో అచ్యుత్ అంబరీష్

స్టెనోగ్రాఫర్ పరీక్షా కేంద్రం పరిశీలించిన ఆర్డీవో

దెందులూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వేగవరం హేలాపూరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీలో జరుగుతున్న స్టెనోగ్రాఫర్ పరీక్షలను ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ బుధవారం పరిశీలించారు. ఆర్డీవోతోపాటు తహసీల్దార్ బత్తుల సుమతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.లావణ్య, ఏవో కరుణానిధి ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి శ్రీనివాస డాంగే

మునిసిపల్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం

» 9న కార్మికులంతా టూల్ డౌన్

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రి శ్రీనివాసరావు ఆరోపించారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎలగాడ దుర్గారావు అధ్యక్షతన బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. మునిసిపల్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులర్ చేస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. హామీలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 9న క్విట్ ఇండియా దినోత్సవం రోజున టూల్ డౌన్ కార్యక్రమాన్ని చేపట్టి నిరసన తెలుపుతున్నట్టు చెప్పారు. రెగ్యులర్ సిబ్బందికి సరెండర్ లీవ్‌లు, పెండింగ్ డీఏ, 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు. సమావేశంలో బండి వెంకటేశ్వరరావు, పళ్లెం కిశోర్, వి.నారాయణరావు, ఎస్.శ్రీనివాస్, డి.వెంకటేశ్వరరావు, డి.అప్పారావు, దొడ్డికార్ల నాగబాబు, బంగారు దుర్గాప్రసాద్, గోవాడ మల్లేశ్వరరావు, ఎ.ప్రసాద్, మాడుగుల జగదీష్, భట్టు నాగబాబు, గండి గవరాజు పాల్గొన్నారు.


ఎంపిడివో కార్యాలయం ఏవో బేబిసరోజినికి వినతిపత్రం ఇస్తున్న పేదలు

50 ఏళ్లు నిండిన పేదలకు పెన్షన్లు నమోదు చేయాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 50 ఏళ్లు నిండిన ఎస్సీ బీసీ పేదలందరికీ పెన్షన్లు నమోదు చేయాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే 50 ఏళ్లు నిండిన ఎస్సీ, బీసీ పేదలకు పెన్షన్లు మంజూరు చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. 16 నెలలు కావస్తున్నా పెన్షన్లు నమోదు చేయలేదన్నారు. కార్యాలయ ఏవో టి.బేబిసరోజినికి వినతిపత్రం అందజేశారు.

వైకల్యం నివారణపై అవగాహన

ఏలూరు రూరల్, ఆగస్టు 6, (ఆంధ్రజ్యోతి): ఏలూరు సమీపంలోని దొండపాడు జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఎఆర్‌డిజికె మునిసిపల్ హైస్కూల్‌లో దివ్యాంగుల హక్కుల చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైకల్య నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం ప్రత్యేక హక్కులను కల్పించిందని, వాటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విక్రాంతికుమార్ పునరావాస కేంద్రం సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోక్సో, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

జీలుగుమిల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎస్సై వి.క్రాంతికుమార్ అన్నారు. జీలుగుమిల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం పోక్సో, సైబర్, మాదక ద్రవ్యాలతో నష్టాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహ కల్పించారు. వాటి వల్ల కలిగే దుష్పరిణామాలు, విద్యార్థులకు చెడు అలవాట్ల వల్ల కలిగే నష్టాలు వివరించారు. హెచ్‌ఎం రాజు, సిబ్బంది లక్ష్మణ్ ఉన్నారు.

వ్యాపారాల్లో గొడవలు : ఒకరిపై దాడి

కొయ్యలగూడెం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బియ్యం వ్యాపారంలో గొడవల నేపథ్యంలో ఒకరిపై దాడి జరిగింది. నరసన్నపాలెం పెట్రోల్ బంకు వద్ద మంగళవారం రాత్రి జరిగిన సంఘటన వివరాలు ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. పిఠాపురం మండలం పత్తిపాడుకు చెందిన చోడిశెట్టి వెంకట మహేశ్ కారులో డ్రైవర్ అజయ్‌కుమార్‌తో జంగారెడ్డిగూడెంలో అర్ధరాత్రి బయలుదేరాడు. స్వగ్రామం వెళుతుండగా నరసన్నపాలెం వై.జంక్షన్ పెట్రోలు బంకు సమీపంలో కొందరు మహేశ్‌ను జనసంచారం లేని ప్రదేశానికి బలవంతంగా తీసుకెళ్లారు. అతడిపై దాడి చేసి బంగారం ఉంగరాలు, రూ.45వేలు నగదు తీసుకున్నారు. మా బాస్ చానం రామకృష్ణ చంపమన్నాడని బెదిరించినట్లు మహేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శానం సందీప్, అంజిబాబు, మరో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వ్యాపారంలో గొడవల కారణంగానే దాడి జరిగినట్లు భావిస్తున్నారు. బియ్యం తరలించే విషయం, అనధికార వ్యాపారాల వల్లే మధ్య గొడవ జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఏడుగురి అరెస్ట్

లింగపాలెం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు సిఐ క్రాంతికుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కలరాయనగూడెంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారమందడంతో సీఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బుధవారం దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.25 వేలు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడులలో ఆయనతో పాటు ఎస్ఐ కె.వెంకన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


రామసింగవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్


కొవ్వూరుగూడెంలో కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు


గూటాలలో ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న టీడీపీ నేతలు

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

టీడీపీ నేతల తొలి అడుగు

ప్రజా సమస్యల నమోదు

దెందులూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సమగ్రాభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం చేస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం రామసింగవరంలో సర్పంచ్ అడపా శ్రీనివాసరావు, ఎంపీటీసీ గుర్రం మాధవరావు, దొంగ లయతో కలిసి చింతమనేని ప్రభాకర్ బుధవారం సుపరిపాలనపై తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో అడపా రాఘవ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కూచింపూడిలో గిత్తా సత్యనారాయణ, రామనుజం వెంకటేశ్వరరావు, బాలిన సాయి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరుగూడెంలో..

చింతలపూడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొవ్వూరుగూడెం, పాత బస్టాండ్, కొప్పులవారివీధిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సుపరిపాలన తొలి అడుగు, ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సమస్యలు, ఇంటింటికి వెళ్లి వ్యక్తిగత సమస్యలు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై, ఏడాది పాలనపై కరపత్రాలు అందిస్తూ వివరించారు. కార్యక్రమాల్లో కంభం రమేష్, కొత్తపూడి శేషగిరిరావు, ఏబు, పలువురు పాల్గొన్నారు.

గూటాలలో..

పోలవరం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలం గూటాలలో బుధవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం పాపోలు గణపతి రత్తయ్య ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో పెద్దేహపు వీరవెంకట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో దేశ సుస్థిరాభివృద్ధి


సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

సెయింట్ థెరిసా కళాశాలలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ఏలూరు అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్య, వృత్తి నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలను గ్రామస్థాయిలో ప్రజలు, సంస్థల భాగస్వామ్యంతో బలోపేతం చేయడం ద్వారా భారతదేశ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవచ్చని కెన్యా దేశానికి చెందిన తుర్కానా విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ జి.కుప్పురం అన్నారు. 'భారతదేశ పునరుజ్జీవ పరివర్తనకు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు' అంశంపై సెయింట్ థెరిసా మహిళా కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన కుప్పురం మాట్లాడుతూ యువతులు, మహిళలు విద్యా, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ సీఎస్ఎన్.రాజు మాట్లాడుతూ ఓపెన్‌డేటా, డిజిటల్ సాక్షరత ద్వారా ప్రజలను సాధికారత వైపు నడిపించవచ్చన్నారు. హైదరాబాద్ ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ వీసీ తమ్మా కోటిరెడ్డి మాట్లాడుతూ భారతదేశ సుస్థిర ఆర్థిక లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లడంలో లింగ సమానత్వం ఆవశ్యకతను వివరించారు. ముఖ్యమైన నిర్ణయాల్లో మహిళల భాగస్వామ్యం అసంపూర్ణంగా మిగిలిపోవడం విచారకరమన్నారు. సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రొఫెసర్లు, అధ్యాపకులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎంఎల్‌వీప్రసాద్, కెనడా యూనివర్సిటీ ప్రొఫెసర్ బాల నిక్కు, న్యూఢిల్లీ ఐసీఎస్ఎస్ఆర్ మహిళల అభివృద్ధి కేంద్రం ప్రొఫెసర్ మణి, కళాశాల కరస్పాండెంట్, సుపీరియర్ మదర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండెజ్, ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి, పీజీ కోర్సుల డైరెక్టర్ సిస్టర్ సుశీల, తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యం

దెందులూరు,ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలు తప్పనిసరిగా ఇవ్వాలని స్త్రీశిశు సంక్షేమశాఖ సూపర్‌వైజర్ చిట్టమ్మ అన్నారు. దెందులూరు అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్త సుభాషిణి తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు ప్రయోజనాలు వివరించారు. అంగన్వాడీలను కేంద్రాలను శుభ్రంగా ఉంచాలన్నారు. సహాయకురాలు లక్ష్మి, రంగమ్మ, హైమావతి, ధనలక్ష్మి, సుజాత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. పోతునూరులో సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్వాడీ టీచర్ లలిత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

భీమడోలులో 104 వైద్య శిబిరం

భీమడోలు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మధుమేహం, రక్తపోటుతో ఇబ్బంది వారిని గుర్తించి క్రమం తప్పకుండా మందులు అందించాలని 104 జిల్లా కో ఆర్డినేటర్ భవాని సూచించారు. భీమడోలు 1వ సచివాలయం పరిధిలో జరిగిన 104 వైద్య శిబిరాన్ని సందర్శించిన వైద్యురాలు భవాని సిబ్బందికి పలు సూచన ఇచ్చారు. ఎమర్జెన్సీ డ్రగ్ తదితర కిట్‌లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. 104 సిబ్బంది పలువురు వైద్యులు పాల్గొన్నారు.

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

పెదపాడు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. అసోసియేషన్ చైర్మన్‌గా పిట్లా డేవిడ్‌రాజు, గౌరవ అధ్యక్షుడిగా డి.సామ్యూల్‌రాజు, సలహాదారులుగా సిల్వర్‌కుమార్, తిమోతి, నూతన కమిటీ ప్రెసిడెంట్‌గా బి.సతీష్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.షాలేమ్‌రాజు, జనరల్ సెక్రటరీగా జి.సత్యబాబు, సెక్రటరీగా ఏసురాజు, జాయింట్ సెక్రటరీగా విక్టర్‌పాల్, ట్రెజరర్‌గా ఏసురత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.మోషే, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

సీఐటీయూ కన్వీనర్‌గా సాయికిరణ్

కుక్కునూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల కన్వీనర్‌గా యర్నం సాయికిరణ్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ కుక్కునూరులోని ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం వెల్లడించారు. కోకన్వీనర్‌లుగా కుంజా నాగలక్ష్మి, కారం రాజేశ్వరి, షేక్ వలిభాష, బాడిస సుజాత, మహ్మద్ వలిభాష, తదితరులు కమిటీలో ఉన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు, అధికారులు

భూసార పరీక్షలు చేయించాలి

దెందులూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని, ఈ-పంట నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి ఎల్.శ్రీనివాసరాజు సూచించారు. శ్రీరామవరం, ముప్పవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసరాజు వ్యవసాయ క్షేత్రంలో పర్యటించి రైతులకు పంటలపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వం రైతులకు అందించే రాయితీలు, పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి బి.కరణ్, వ్యవసాయ విస్తరణ అధికారి నాయుడు పాల్గొన్నారు.

ధర్మాజీగూడెంలో..

లింగపాలెం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని, పంటల బీమా తప్పకుండా తీసుకోవాలని ఏవో వి ప్రదీప్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెం, ములగలంపాడు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు పంటకు బీమా తీసుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ కూలీలు బీమా చేయించుకోవాలి

చింతలపూడి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పామాయిల్ కూలీలు బీమా చేయించుకోవాలని సీఐ క్రాంతికుమార్ సూచించారు. ఎర్రగుంటపల్లిలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు, రైతులకు సూచనలు ఇచ్చారు. వై.సుబ్బారావు మాట్లాడుతూ రైతులు పంటల బీమా చేయించుకోవాలన్నారు. పర్విన్ మాట్లాడుతూ డ్రోన్‌లకు సబ్సిడీ ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయిల్‌ఫామ్ విస్తరణకు మొక్కలపంపిణీ చేస్తున్నామని డ్రిప్ ఇరిగేషన్‌పై అవగాహన కల్పించారు. ఏవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించండి

చింతలపూడి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే రోషన్‌కుమార్ దృష్టి సారించారు. మండలంలోని ఎర్రగుంటపల్లి నుంచి కొల్లావారిగూడెం ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. రూ.3 కోట్లతో చేపట్టిన 8 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చెయ్యాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.


రోడ్డు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిడమర్రు ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నిడమర్రు సెక్షన్ పరిధిలో 11 కేవీ లైన్ మరమ్మతులు జరుగుతున్నాయి. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిడమర్రు, గుణపర్రు, విప్పర్రు ఖండ్రిక ప్రాంతాలను సరఫరా నిలిపివేస్తామని ఎస్ఈ అంబేడ్కర్ తెలిపారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

పేదలను ఆదుకుంటున్న సీఎంఆర్‌ఎఫ్


జీలుగుమిల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఆరోగ్య అత్యవసర సమయంలో సీఎంఆర్‌ఎఫ్ ఆదుకుంటుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద 15 మందికి సీఎంఆర్‌ఎఫ్ నిధులు రూ.10,27,485 చెక్కులను బుధవారం ఎమ్మెల్యే సంబంధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. వారు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే బాలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. టి.నరసాపురం జనసేన మండల అధ్యక్షుడు అడప నాగరాజు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చేబ్రోలులో తిరంగా ర్యాలీ

ఉంగుటూరు ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు గ్రామంలో జాతీయ సమైక్యతను చాటేందుకు బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఏఎంసీ చైర్మన్ జ్యోతి అయ్యప్ప, సర్పంచ్ రాంధే లక్ష్మీసునీత తదితరులు పాల్గొన్నారు. జనప నారతో చేసిన సంచులను ప్రదర్శించారు.

పల్లెపల్లెకు పత్సమట్ల

ఉంగుటూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలో కంసాలిగుంట, గోపాలపురం, గొల్లగూడెం, చేబ్రోలు తదితర గ్రామాలలో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌లతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాంధే లక్ష్మీ సునీత, కరప వెంకట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


చేబ్రోలులో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పత్సమట్ల


నితిన్ గడ్కరీకి రింగ్‌రోడ్డు గూర్చి వివరిస్తున్న ఎంపీ మహేశ్

నూజివీడు రింగ్ రోడ్డు మంజూరు కోసం కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ మహేశ్

ఏలూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణ పరిధిలో రింగ్ రోడ్డును మంజూరు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ పుట్టా మహేశ్ కోరారు. న్యూఢిల్లీలో బుధవారం మంత్రి కలిశానని, సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు. త్వరలో కేంద్ర కేబినెట్ అనుమతి తీసుకుని నూజివీడుకు రింగ్ రోడ్డు ప్రకటించే అవకాశం ఉందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.

గౌరీ దేవి ఆలయానికి రూ.25 వేల విరాళం

దెందులూరు, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): పోతునూరు గ్రామ దేవత గౌరి శంకరదేవి ఆశీస్సులు ప్రజందరిపై ఉండాలని ప్రముఖ పారిశ్రామికవేత్త డీవీఆర్‌కే చౌదరి అన్నారు. పోతునూరులో నిర్మిస్తున్న గౌరి శంకరదేవి ఆలయానికి రూ.25,116 విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు చౌదరిని ఘనంగా సన్మానించారు.


విరాళం అందిస్తున్న డీవీఆర్‌కే చౌదరి

రేపు అచ్చమ్మ పేరంటాలమ్మకు సారె

దెందులూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గాలాయగూడెం గ్రామ దేవత అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారికి చీర, సారె సమర్పిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. 116 మంది ముత్తైదువులు 39 రకాల పిండి వంటలతో పసుపు, కుంకుమ, పుట్టింటి చీర అందిస్తారు.

లక్ష్మీగణపతికి విశేష పూజలు



ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని లక్ష్మీగణపతి స్వామికి బుధవారం భక్తులు విశేష పూజలు చేశారు. గరికతో అర్చన, బెల్లం నివేదనలు సమర్పించారు. అర్చకుడు రాఘవేంద్రశర్మ స్వామి వారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం పుష్పాలు, కాకరకాయలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో సీహెచ్.చిన నాగేశ్వరరావు, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

సీతారామస్వామికి పూజలు



భీమడోలు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గుండుగొలను సీతారామస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు బుధవారం ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కల్యాణమూర్తులకు స్నపన కార్యక్రమాలు స్వామి వారికి పవిత్ర అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సర్వేలో పంచాయతీ సిబ్బందికి సహకరించాలి

జీలుగుమిల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలుకు పంచాయతీ సిబ్బంది సర్వేకు ప్రజలు సహకరించాలని సర్పంచ్ చిర్రి జగదాంబ అన్నారు. స్వమిత్వ, రీసర్వే, పీ4 అమలుకు సర్వేపై వచ్చిన వారు పంచాయతీ సిబ్బందిని గుర్తించాలన్నారు. బుధవారం పంచాయితీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ప్రజల నుంచి పలు వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యదర్శి అశోక్, వీఆర్వో రామతులసి, సిబ్బంది నందిని, స్వేత, రాజు ఉన్నారు.

విద్యార్థుల కళాశాల ఫీజు చెల్లించిన టీడీపీ నేతలు

లింగపాలెం, ఆగష్టు 6(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 73 మంది విద్యార్థులకు అడ్మిషన్ ఫీజు టీడీపీ నేతలు అందజేశారు. గుత్తా సత్యసాయివరప్రసాద్ రూ.15వేలు, గారపాటి బుజయ్య రూ.15వేలు ప్రిన్సిపాల్ సత్యనారాయణకు అందించారు. ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సహకారంతో కళాశాలను అభివృద్ధి చేస్తామన్నారు. వారిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో గజ్జా వెంకటేశ్వరరావు, నాయకులు, లెక్చరర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిధులివ్వండి.. మహాప్రభో!

(5వ పేజీ తరువాయి)

అవసరాలకు, వీధిలైట్లకు విద్యుత్ వినియోగం మేజర్ పంచాయతీల్లో కాస్తంత ఎక్కువగానే ఉంటుంది. చిన్న పంచా యతీల్లో వీధిలైట్లు తక్కువే, రోజువారి కరెంటు వాడకం అంతంత మాత్రమే. ఒక నెలకు పంచాయతీలో ఎంత విద్యుత్ బిల్లు వస్తుందనేది బహిర్గతం చేయకపోవడంతో కేవలం బకాయిలు వచ్చేసరికి మాత్రమే.. ఇంత బకాయి పడ్డారంటూ విద్యుత్ శాఖ అధికారులు మౌఖి కంగానే తెలిపేవారు. ఇప్పటికీ కరెంటు బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. ఎల్ఈడీ బల్బుల వాడకంతో విద్యుత్ డిమాండ్‌ను సగానికి సగం తగ్గించవచ్చునంటూ పల్లె, పట్నం తేడా లేకుండా ఎల్ఈడీ లైట్లను అమర్చారు. అయితే మేజర్ పంచాయతీల్లో కరెంటు తగ్గకపోగా బిల్లులు మరింత పెరుగుతూ వచ్చింది. అందుకనే పంచాయతీల్లో కరెంటు బిల్లుల సమస్యే అతిపెద్ద సమస్య.

పారబోలా నైన్ సంస్థకు రెండు జాతీయ అవార్డులు

» మంత్రి పార్థసారథికి సీఎం చంద్రబాబు అభినందన



మంత్రి పార్థసారథిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

నూజివీడు టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో స్టార్టప్ సంస్థగా ప్రారంభమైన అమెరికాకు చెందిన పారబోలా నైన్ ఏఐ సంస్థ జాతీయ హాకథాన్‌లో రెండు జాతీయ అవార్డులను పొందింది. ఈ నేపథ్యంలో ట్రిపుల్ ఐటీలోని పారబోలా సంస్థ ఏర్పాటుకు కృషిచేసిన మంత్రి కొలుసు పార్థసారథిని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం అమరావతిలో అభినందించారు. జాతీయస్థాయిలో నిర్వహించిన హాకథాన్‌లో పోలీస్‌శాఖ, సివిల్ సప్లైస్ శాఖకు సంబంధించి సంస్థ ఇచ్చిన ఏఐ టెక్నాలజీ జాతీయస్థాయిలో అవార్డులను అందుకుంది. పారబోలా సంస్థ జాతీయ అవార్డులను పొందిన విషయాన్ని మంత్రి సారథి సీఎం దృష్టికి తీసుకువెళ్లగా నూజివీడు నియోజకవర్గాన్ని వ్యవసాయ పారిశ్రామిక, సమాచార సాంకేతిక రంగాల్లో రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉండేలా కృషిచేయాలని అందుకు సంబంధించి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి సారథికి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.



కైకలూరు బందెలదొడ్డిలో గోవులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని

గోవులను సంరక్షించుకోవాలి : ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):రహదారిపై గోవులను వదలకుండా వాటిని సంరక్షించుకోవాలని, ఇటీవల ఇద్దరు యువకులు గోవులను ఢీకొని మృతి చెందారని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం కైకలూరు రైతుబజారు ఎదురుగా ఉన్న బందెలదొడ్డిలో వున్న గోవులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గోవులను దేవతల్లా పూజిస్తామని అలాంటి వాటిని రోడ్లపై అనాథలుగా వదిలిపెట్టడం బాధాకరమన్నారు. గోవులు సంచరించడం వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఇటీవల ద్విచక్రవాహనంపై వెళ్లే ఇద్దరు యువకులు మృతి చెందారన్నారు. బందులదొడ్డిలో వున్న గోవుల యజమానులు రూ.100చెల్లించి గోవులను తీసుకువెళ్లాలన్నారు. మరోసారి రోడ్లపై సంచరిస్తే నేరుగా గోశాలలకు తరలిస్తామన్నారు. ఈ గోవులను రక్షించేందుకు గోరక్షణ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని ఈ కమిటీకి సభ్యులుగా ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, సర్పంచ్ కేవీఎస్‌ఎం నాయుడు, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ పరిరక్షిస్తారన్నారు. ఈ కమిటీతోపాటు పంచాయతీ సిబ్బంది, పోలీసు, పశు వైద్యాధికారులు అందరూ కలిసిగట్టుగా సహకరించి గోవులను సంరక్షించాలన్నారు. కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆగిరిపల్లి సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనూష

ఆగిరిపల్లి, ఆగస్టు 6, (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల కార్యాలయంలో ఎంపీపీ గోళ్ల అనూష అధ్యక్షతన ఎంపీడీవో బి.భార్గవి ఆధ్వర్యంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా నిర్వహించారు. సమావే శానికి మండల ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, పలు మండలాల శాఖ అధికారులు పాల్గొన్నారు. విద్యాశాఖ అధికారి-2 ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ విద్యాశక్తి పథకంలో భాగంగా ఆగిరిపల్లి హైస్కూల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని తరగతుల విద్యార్థులకు స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.రాగమయి మాట్లాడుతూ మండలంలో 68 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి 114 మంది విద్యార్థులను ప్రైమరీ స్కూల్‌కి పంపించామని తెలిపారు. ఏవో జె.భవాని మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ మొదటి విడత నగదు జమ కాని రైతుల సమస్యను పరిష్కరించి త్వరలోనే బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. పలు శాఖల అధికారులు తమ నివేదిక వివరాలను సభలో చదివి వినిపించారు. డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్, జడ్పీటీసీ వీరబాబు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు ర్యాలీలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జడ్పీ సిబ్బంది

ఇంటింటా జాతీయ జెండా ఎగురవేద్దాం

» జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరుసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):జాతీయ పతాకాన్ని ఇంటింటా ఎగురవేయడం దేశభక్తి ప్రదర్శనకు నిదర్శనమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల ఐదో తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న హర్‌ఘర్ తిరంగా ఉద్యమంలో భాగంగా బుధవారం ఏలూరు జడ్పీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఆమె ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా మనం దేశాన్ని ప్రేమి స్తున్నామన్న సందేశం ప్రపంచానికి తెలియజేస్తు న్నామన్నారు. ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకచర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ శాఖలపై త్రివర్ణ పతాకాల ఆవిష్కరణ, పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలపై జాతీయ పతాకాలను ఎగురవేయడం, ప్రజల్లో చైతన్యం కోసం ర్యాలీలు, పాటలపోటీలు, నినాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, టీడీపీ నేత ఘంటా ప్రసాదరావు, జడ్పీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నిధులివ్వండి.. మహాప్రభో!

(5వ పేజీ తరువాయి)

అవసరాలకు, వీధిలైట్లకు విద్యుత్ వినియోగం మేజర్ పంచాయతీల్లో కాస్తంత ఎక్కువగానే ఉంటుంది. చిన్న పంచా యతీల్లో వీధిలైట్లు తక్కువే, రోజువారి కరెంటు వాడకం అంతంత మాత్రమే. ఒక నెలకు పంచాయతీలో ఎంత విద్యుత్ బిల్లు వస్తుంద నేది బహిర్గతం చేయకపోవడంతో కేవలం బకాయిలు వచ్చేసరికి మాత్రమే.. ఇంత బకాయి పడ్డారంటూ విద్యుత్ శాఖ అధికారులు మౌఖి కంగానే తెలిపేవారు. ఇప్పటికీ కరెంటు బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. ఎల్‌ఈడీ బల్బుల వాడకంతో విద్యుత్ డిమాండ్‌ను సగానికి సగం తగ్గించవచ్చునంటూ పల్లె, పట్నం తేడా లేకుం డా ఎల్‌ఈడీ లైట్లను అమర్చారు. అయితే మేజ ర్ పంచాయతీల్లో కరెంటు తగ్గకపోగా బిల్లులు మరింత పెరుగుతూ వచ్చింది. అందుకనే పంచాయతీల్లో కరెంటు బిల్లుల సమస్యే అతిపెద్ద సమస్య.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ముసునూరు సొసైటీ చైర్మన్‌గా దేవినేని శ్రీధర్



ముసునూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ముసునూరు కో-ఆపరేటివ్ సొసైటీ నూతన చైర్మన్‌గా దేవినేని శ్రీధర్ ఎంపికయ్యారు. ఉన్నతాధికారుల నుంచి ముసునూరు సొసైటీ అధికారులకు త్రిసభ్య కమిటీ సభ్యుల పేర్లు బుధవారం వచ్చాయి. నూతన చైర్మన్ శ్రీధర్‌కు నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్ కిరణ్, బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను, ఉపసర్పంచ్ తోట శ్రీనివాసరావు, నాయకులు తలిమెల్లి రంగరావు, నక్కా నరసింహారావు స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు.

టీడీపీ హయాంలో హౌసింగ్ బిల్లులకు మోక్షం

» ఆరేళ్ల తరువాత 677 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.1.25 కోట్లు జమ



సోమవరంలో పెండింగ్ బిల్లు విడుదలైన ఇల్లు

చాట్రాయి, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): గత తెలుగుదేశం హయాంలో హౌసింగ్ పెండింగ్ బిల్లులకు ఆరేళ్ల తరువాత ఎట్టకేలకు మోక్షం లభించడంతో లబ్ధిదారులు ఆనందోత్సవాలు వ్యక్తం చేస్తున్నారు. చాట్రాయి మండలంలో 2014-19 మధ్య ఉన్న పెండింగ్ బిల్లులు 677 మందికి రూ.1.25 కోట్లు గత రెండు రోజుల నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ అయినట్టు హౌసింగ్ అధికారులు తెలిపారు. 2019లో టీడీపీ అధికారం కోల్పోవడంతో అప్పటివరకు ఉన్న హౌసింగ్ బిల్లులు ఇవ్వకుండా వైసీపీ సర్కార్ మొండి చెయ్యి చూపింది. గత ఎన్నికల ప్రచారంలో నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి టీడీపీ హయాంలో పెండింగ్ హౌసింగ్ బిల్లులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. హామీ మేరకు బిల్లులు విడుదల కావడంతో లబ్ధిఆరులు, కూటమి నాయకులు హర్షం వ్యకం చేస్తున్నారు.

● అధికారిక లెక్కల ప్రకారం వైసీపీ అధికారంలోకి వచ్చే నాటికి మండలంలో పక్కా ఇళ్ల పరిస్థితి ఇది. బేస్‌మెంట్ లెవెల్ 167 ఇళ్లు, రూఫ్ లెవెల్ 73, శ్లాబ్ వేసినవి 566 ఉన్నాయి. ఇంకా కొంత మంది కేంద్ర ప్రభుత్వం హౌసింగ్ పథకాల లబ్ధిదారులకు బిల్లులు విడుదల కావల్సి ఉంది. దాదాపు ఈ లబ్ధిదారు లందరూ అప్పులు చేసి ఇళ్ల నిర్మించు కుని వాటిలో నివాసం ఉంటున్నారు. అప్పుడు ఉన్న యూనిట్ ధర రూ.1.50 లక్షల ప్రాతిపదికన బిల్లులు చెల్లించారు. ఇచ్చిన హామీ ప్రకారం పెండింగ్ హౌసిం గ్ బిల్లులు విడుదల చేయించిన మంత్రి పార్థ సారథికి టీడీపీ మండల అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఏవో చాముండేశ్వరి

ముసునూరు, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంబించి, అధిక దిగుబడులు సాధించాలని ఏవో ఎ.చాముండేశ్వరి అన్నారు. బుధవారం వేల్పుచర్లలో 'పొలం పిలు స్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వరి పంటలను ఆమె పరిశీలించి, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. సచివాల యంలో జరిగిన రైతుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించేందుకు ఉపయుక్తంగా ఉన్న ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడుకోవాలని సూచించారు. వరికి ఎకరానికి పంటబీమా పథకం కింద రూ840 కట్టుకుంటే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే రూ.42 వేలు బీమా నగదు వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.మోహన్‌రావు, పి.శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మానం గంటేశ్వరరావు, మాజీ డీసీ చైర్మన్ తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ వాహనాలకు రూ.15 వేలు జరిమానా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న వాహనాలు

ముసునూరు, ఆగస్టు6 (ఆంధ్ర జ్యోతి): మండ లంలోని చిల్లబోయినపల్లిలో ఉన్న మైనింగ్ క్వారీ నుంచి మట్టిని రవాణా చేస్తున్న ఐదు టిప్పర్ వాహనాలకు బుధవారం తహసీల్దార్ ప్రశాంతి రూ.15వేలు జరిమానా విధించారు. అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని గ్రామస్థుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఐదురోజుల క్రితం క్వారీపై దాడిచేసి ఐదు వాహనాలను పట్టుకోగా, అనుమతి పత్రాలు చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అనుమతి పత్రాలను పరిశీలించగా 2026 డిసెంబరు వరకు మైనింగ్‌కు అనుమతి ఉన్నట్టు నిర్ధారణ అయిందన్నారు. అయితే తవ్వకాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతుండడం, రాత్రి సమయాల్లో రవాణా చేస్తుండడంతో పట్టుకున్న ఐదు ఖాళీ టిప్పర్లకు ఒక్కొక్క టిప్పర్‌కు రూ.3 వేలు చొప్పున రూ.15 వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు. యజమాని నాగరాజు నగదును ఆన్‌లైన్ చలానా ద్వారా చెల్లించడంతో వాహనాలను విడుదల చేశామని ఆమె తెలిపారు.



సృజన, సత్యనారాయణను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

ఎంఎన్‌పాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా సృజనాచౌదరి ప్రమాణ స్వీకారం

నూజివీడు టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి):నూజివీడు మండలం ఎంఎన్‌పాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా యనమదల సృజనాచౌదరి ప్రమాణ స్వీకారం చేశారు. మంగళవారం రాత్రి పీఏసీఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రమాణస్వీకారం చేశారు. టీడీపీ యువ నాయకుడు కొలుసు నితిన్‌కృష్ణ, నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి యనమదల సత్యనారాయణ, నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష, తెలుగురైతు అ ధ్యక్షుడు జగ్గవరపు వెంకటరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు యనమదల శ్రీనివాసరావు, ముసునూరి రాజా తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి పీఏసీఎస్ చైర్మన్‌గా రామ్మోహనరావు



చాట్రాయి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చాట్రాయి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన తుమ్మల రామ్మోహనరావును నియమిస్తూ సహకార శాఖ అధికారులు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. సభ్యులుగా కాలసాని సత్యనారాయణ, దివ్వెల జయరాజు నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథికి, నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబుకు, కూటమి నాయకులకు రామ్మోహనరావు కృతజ్ఞతలు తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ రామకృష్ణ

ప్రమాదాలపై డ్రైవర్లకు అవగాహన ఉండాలి

ఆగిరిపల్లి, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ చేసే సమయంలో రోడ్డు ప్రమాదాలపై బస్ డ్రైవర్లు అవగాహన కలిగి ఉండాలని నూజివీడు రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సూచించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు ఆగిరిపల్లి ఎస్‌ఐ శుభశేఖర్ సిబ్బందితో కలిసి ఆయన ఆగిరిపల్లి ఎస్‌ఆర్‌ఐ ఇంజనీరింగ్ కాలేజీ బస్సులను నడిపే డ్రైవర్లకు బుధవారం అవగాహన కల్పించారు. ఎల్లవేళలా కండీషన్‌లో ఉండేవిధంగా చూసుకోవాలని, స్కూల్, కాలేజీ విద్యార్థులను తరలించే సమయాలలో వేగంగా కాకుండా రహదారిని బట్టి ప్రయాణాలు కొనసాగించాలన్నారు. డ్రైవర్లు డ్రైవింగ్ సమయాలలో మద్యం సేవించరాదని అలా సేవించిన ఎడల డ్రైవర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది, ఎస్‌ఆర్‌ఐ ఇంజనీరింగ్ కాలేజీ బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

'మునిసిపల్ కార్మికులకు ఈఎస్‌ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేయాలి'



మాట్లాడుతున్న చలసాని వెంకటరామారావు

నూజివీడు టౌన్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు ఈఎస్‌ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. బుధవారం నూజివీడు అమర్‌భవన్‌లో మునిసిపల్ శానిటేషన్ కార్మికుల రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పలు రంగాల కార్మికులకు ఈఎస్‌ఐ, డిస్పెన్సరీ సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కనీసం ఔషధాలు అందుబాటులో లేవని, ప్రిస్క్రిప్షన్ తీసుకుని బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తక్షణం ఈఎస్‌ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్, పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ తీసివేసి జీతంతో కలిపి జీతం పెంచినట్లు చూపడం దారుణమన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, మాజీ కౌన్సిలర్ సత్యప్రకాశ్, నూజివీడు మునిసిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ముత్యాల విజయ్, కార్యదర్శి నంద, మోచర్ల జయరావు, అల్లం కనకదుర్గ, ఆకుల మహేష్, ఎం.రంగారావు పాల్గొన్నారు.

నివాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణం వద్దు

» సబ్ కలెక్టర్‌కు అక్కిరెడ్డిగూడెం వాసుల ఫిర్యాదు



అక్కిరెడ్డిగూడెంలో సెల్ టవర్ నిర్మాణ పనుల దృశ్యం

ముసునూరు,ఆగస్టు6(ఆంధ్ర జ్యోతి): అక్కిరెడ్డిగూడెం సాయిబాబా ఆలయం సమీపంలో నివాసాల మధ్య ఒక ప్రైవేటు కంపెనీ నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకున్నారు. స్థానికులు, సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీసత్యనారాయణ మాట్లాడుతూ ఈ టవర్ ఏర్పాటుకు అనుమతులు లేకుండానే వారం రోజుల కిత్రం అక్రమంగా రాత్రికి రాత్రే బేస్‌మెంట్ వేశారని, దీనిపై ఎంపీడీవో బీవీ సత్యనారాయణకు ఫిర్యాదు చేశామన్నారు. పంచాయతీ కార్యదర్శి విద్యాధరరావు ఈ టవర్ నిర్మాణం నిలిపివేయాలని కంపెనీ ప్రతినిధులకు హెచ్చరించడంతో పనులను నిలిపి వేసినట్లు తెలిపారు. ఈ టవర్ ఏర్పాటును శాశ్వతంగా నిలిపివేయాలని స్థానికులు నూజి వీడు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అయినప్పటికీ మళ్లీ మంగళవారం రాత్రి టవర్‌కు సంబంధించిన మిషనరీని దింపి, పనులు చేస్తున్నారని స్థానికులు తెలిపారు. ఈ టవర్ ఏర్పాటు జరిగితే భవిష్యత్‌లో ప్రజలకు ప్రాణ హాని తప్పదని, అక్రమంగా, జనవాసాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న టవర్‌ను జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నూజివీడులో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ

'పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలి'

నూజివీడు టౌన్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): బిడ్డకు జన్మనిచ్చిన తొలి గంటలోపు బిడ్డకు ముర్రుపాలు తాగించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. బుధవారం నూజివీడు పట్టణం అమ్మవారితోట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలను ఇవ్వడం ద్వారా బిడ్డలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. మెదడు ఎదుగుదలకు దోహదపడుతుందని, తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం శ్రీదేవి, అంగన్‌వాడీ వర్కర్ షేక్ మెహతాబీ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

● ముసునూరు: బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెంపొందుతుందని జీఎంఎస్‌కేలు సలోమి, రాగసుధ అన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా బుధవారం గోపవరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, తల్లులకు తల్లిపాలు విశిష్టతపై అవగాహన కల్పించారు. తల్లి బిడ్డకు ఆరు నెలలపాటు పాలు ఇస్తే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని, పెరుగుదల ఉంటుందని సలోమి వివరించారు. అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారన్ని సద్వినియోగం చేసుకుని, వైద్యుల సూచనలను పాటించాలని అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం శకుంతలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కైకలూరులో హర్షం వ్యక్తం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

200 యూనిట్ల ఉచిత విద్యుత్ శుభసూచికం

» రాష్ట్ర నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు

కైకలూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాపులకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం తీర్మానం చేయడం శుభసూచికమని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల కైకలూరులో నాయిబ్రాహ్మణులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఉన్న 72 వేల సెలూన్‌షాపులకు ఉచిత విద్యుత్ ఉపకరిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాయీ బ్రాహ్మణులంతా ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఎంపీ పుట్టా మహేష్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ నాయకులు కొత్తపల్లి విజయ్, మాటూరి పండు, పసలపూడి సత్యనారాయణ, కోడూరి నాగరాజు, ములువలస అచ్చారావు, తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తల మధ్య గొడవ.. మహిళ ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భార్యా భర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగి విభేదాలు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఒక మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మండవల్లి మండలం ప్రత్తిపాడు గ్రామానికి తేరా సుధారాణి (35)కు ఆమె భర్త రమేష్‌కు మధ్య ఈనెల 5న గొడవ జరిగింది. ఈనేపథ్యంలో పురుగుల మందు తాగింది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందింది. మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. ఈ సంఘటనపై మండవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నితిన్ గడ్కరీకి వివరిస్తున్న ఎంపీ మహేశ్

నూజివీడు రింగ్ రోడ్డుకు 'గడ్కరీ' సానుకూలం

» కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ మహేశ్

ఏలూరు, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణ ప్రజల కోరిక మేరకు ఆ ప్రాంతంలో రింగ్ రోడ్డును త్వరగా మంజూరు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కోరారు. బుధవారం న్యూఢిల్లీలో ఆయనను కలిసి వివరించడంతో మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే కేంద్ర కేబినెట్ అనుమతి తీసుకుని నూజివీడుకు రింగ్ రోడ్డు ప్రకటించే అవకాశం ఉందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఏడీఏ పార్వతి

అనుమతులున్న చెరువులకే విద్యుత్ రాయితీ

కలిదిండి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చెరువులకు అనుమతులు ఉంటేనే విద్యుత్ రాయితీ వస్తుందని, పంట పొలాలను, చేపలు, రొయ్యల చెరువులుగా మార్చుచేసుకునే వారు ప్రభుత్వ అనుమతులు పొందాలని వ్యవసాయశాఖ ఏడీఏ పార్వతి, మత్స్యశాఖాధికారి రవికుమార్ సూచించారు. బుధవారం భాస్కరావుపేట, సంతోషపురం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట పొలాల మధ్యలో చెరువులు తవ్వితే ఊట వేసి పొలాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. రైతులు ఫిర్యాదు చేస్తే చెరువుల తవ్వకాలను నిలుపుదల చేస్తామన్నారు. చెరువుల్లో చేపలు, రొయ్యలను సహజ సిద్ధంగా పెంచాలని, సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో ఏవో విద్యాసాగర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తోటలో సీసీ కెమెరాలు చోరీ

చాట్రాయి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కోటపాడు గ్రామంలో తమ వ్యవసాయ భూమి తోటలో ఏర్పాటు చేసి రెండు సీసీ కెమెరాలు మంగళవారం రాత్రి కొందరు చోరీ చేశారని పులగం వెంకటేశ్వరరెడ్డి ఫిర్యాదు చేశారు. బుధవారం ఈమేరకు చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



అలంకరణలో శోభనాచలస్వామి

మూడోరోజు శోభనాచలుని పవిత్రోత్సవాలు

ఆగిరిపల్లి, ఆగస్టు 6, (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పవిత్రోత్సవాలలో భాగంగా మూడో రోజు బుధవారం ఆలయ ఈవో సీహెచ్ సాయి పర్యవేక్షణలో పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పవిత్రోత్సవాల సందర్భంగా ద్వాదశి బుధవారం ఉదయం ఆలయ అర్చకులు వేదాంత శేషుబాబు, జి.అనంత కృష్ణ స్వామివారికి ఉదయం విశేష అర్చన, స్నపన, విశేష అలంకరణ, శ్రీలక్ష్మీ నరసింహ సుదర్శన మూల మంత్ర హోమం నిర్వహించారు. సాయంత్రం నవకుంభారాధన పారమాత్మి కోపనిషత్ పూర్వక మహాశాంతి హోమం, నీరాజన, మంత్రపుష్ప, ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.